
ఈనాడు
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం అక్టోబరు 9, 2024



ధనలక్ష్మీ నమోస్తుతే

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. నిర్వాహకులు ఆలయానికి విశేష అలంకరణ చేయడంతో పాటు భారీమొత్తంలో నాణేలతో తీర్చిదిద్దారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మిగిలిన చోట్ల విశేష అలంకరణలు, సాంస్కృతి కార్యక్రమాలు, అమ్మవారి దర్శనాలు కొనసాగాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం)



కళ్లలో వేదన.. కన్నీటి నివేదన 14




ఏడాదిలో 350 మంది మృతినా!

నెల్లూరు(కలెక్టరేట్) : జిల్లాలో ఏడాది కాలంలో 350 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడంపై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు రవాణాశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను డీటీసీ చందర్ వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ.. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేసిన తర్వాతే.. నివేదికతో హాజరుకావాలని మండిపడ్డారు. ప్రముఖ కూడళ్లలో హోర్డింగ్‌లు, బ్యానర్లు ఉండటాన్ని ప్రస్తావిస్తూ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు శ్రీచందన, సుధాకర్ రెడ్డి, నాగలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, జాతీయ రహదారి అధికారులు విద్యాసాగర్, సుడాన్, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరం.. అప్రమత్తతే అస్త్రం!

రోజుకో రూపంలో పేట్రేగుతున్న కేటుగాళ్లు ● సత్వర ఫిర్యాదుతోనే ప్రయోజనం




ఈనాడు, నెల్లూరు

తలుపులు బద్దలు కొట్టాల్సిన పనిలేదు. గోడలకు కన్నమేయాల్సిన అవసరం లేదు. కాలు బయటపెట్టకుండానే కావాల్సినంత దోచుకునే వెసులుబాటు. కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం.. మాటలతో బురిడీ కొట్టించే నైపుణ్యమే పెట్టుబడి.. ఇవే అస్త్రాలుగా సైబర్ నేరగాళ్లు రోజుకో తరహా మోసంతో రెచ్చిపోతున్నారు. మొన్నటి వరకు డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు చోరీ చేసి.. మన ప్రమేయం లేకుండానే షాపింగ్ మొదలు పిన్ నంబరు కొట్టేసి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు కాజేయడం, స్విమ్ స్వాప్ చేసిన మన ఫోన్‌కు అందాల్సిన మెసేజ్‌లను మళ్లించి.. డబ్బు కొల్లగొట్టడం చేసిన నేరగాళ్లు.. ఆ తర్వాత అజ్ఞాత వ్యక్తులుగా ఫోన్ చేసి మాటలతో మభ్యపెట్టడం తదితరాలు చేశారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి. . సీబీఐ, ఈడీ అధికారిలా ఫోన్ చేయడం.. మీ వివరాలన్నీ చెప్పేస్తూ నమ్మబలికి.. చివరకు డిజిటల్ అరెస్టు పేరుతో హడలెత్తిస్తున్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డిని దాదాపు ఆరున్నర రోజుల పాటు.. రూ. 15 కోట్లు డిమాండ్ చేయడం సంచలనం రేపింది. ఈ నేపథ్యంలో వాటి నుంచి బయటపడాలంటే.. అవగాహన, అప్రమత్తతే ఆయుధమని నిపుణులు, పోలీసులు సూచిస్తున్నారు.

ఎక్కడికీ వెళ్లనీయకుండా...

సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ చేసి తాము పోలీసులమనో, దర్యాప్తు అధికారులమనో నమ్మిస్తారు. బ్యాంకు ఖాతా, సిమ్, ఆధార్ కార్డు వంటివి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని బెదిరిస్తారు. విచారణ పూర్తయ్యేంత వరకు అక్కడి నుంచి కదలడానికి వీల్లేదంటూ కట్టడి చేస్తారు. డబ్బులు చెల్లిస్తే వదిలేస్తామని చెబుతారు. వారి ఖాతాలో జమయ్యాకే విడిచిపెడతారు. ఇలా మనిషిని ఎక్కడికీ వెళ్లనీయకుండా నిర్బంధించడమే డిజిటల్ అరెస్టు. వాకాటి నారాయణరెడ్డిని దాదాపు ఆరున్నర రోజుల పాటు ఇదే విధంగా గది నుంచి బయటకు రాకుండా చేశారు. విచారణ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని సూచించారు. చివరకు మిమ్మల్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని, రూ. కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో అప్రమత్తమైన వాకాటి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.



అలా చెబితే.. అనుమానించాల్సిందే!

- ఇలాంటి మోసాల్లో మిమ్మల్ని నమ్మించేందుకు మీ వ్యక్తిగత వివరాలన్నీ చెబుతారు. అవన్నీ నిజమేనని భావించొద్దు. డిజిటల్ అరెస్టు అనేది భారతీయ చట్టాల్లో లేదనే విషయంపై అందరికీ అవగాహన ఉండాలి.
- కస్టమ్స్, సీబీఐ, ఈడీ, ఏసీబీ.. ఇలాంటి సంస్థల నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా చెబితే కచ్చితంగా అనుమానించాల్సిందే.
- దేశంలో ఏ దర్యాప్తు సంస్థ కూడా వీడియోకాల్‌లో విచారణ చేయదు. మీ పేరిట వచ్చిన పార్శిళ్లు, కొరియర్లలో మాదకద్రవ్యాలు ఉన్నాయని బెదిరించినా భయపడొద్దు.
- ఆ ఫోన్ నంబరు సహా.. వివరాలన్నీ నమోదు చేసుకుని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి.
- బ్యాంకు ఖాతా, పాన్, ఆధార్ కార్డుతో ముడిపడిన వివరాలు ఇవ్వొద్దు.
- ఇలాంటి కాల్ వచ్చినప్పుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబరు 1930, నేషనల్ పోలీసు హెల్ప్‌లైన్ నంబరు 112కు ఫోన్ చేసి ధ్రువీకరించుకోవచ్చు.
- అజ్ఞాత వ్యక్తులు ఏదైనా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబితే స్పందించొద్దు.

కేసులంటూ బెదిరించి!

'మేం అవినీతి నిరోధకశాఖ(ఏసీబీ) కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నాం. మీ అక్రమాస్తులు, దస్త్రాల్లో అవకతవకలకు పాల్పడిన చిట్టా మా దగ్గర ఉంది. మేము అడిగినంత ఇవ్వకపోతే ఇబ్బంది పడతారం'టూ ఫోన్ చేసి బెదిరిస్తారు. దీంతో కొందరు జాగ్రత్త పడుతుండగా- మరికొందరు సొమ్ము ముట్టజెప్పి మోసపోతున్నారు. చేజర్ల మండలం తహసీల్దారు ఎ.వెంకట రమణారావు మోసపోయిన ఉదంతం ఇలాంటిదే. నేరగాళ్లు రూ. 5 లక్షలు డిమాండ్ చేయగా.. వివిధ రూపాల్లో బాధితుడు రూ.3.60 లక్షలు ఇచ్చారు. చివరకు సహచర సిబ్బంది అప్రమత్తం చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫెడెక్స్ కొరియర్ సర్వీసెస్ పేరుతో ఫోన్‌కాల్స్ చేస్తూ.. ఈ తరహా మోసాలకు ఎక్కువగా పాల్పడుతున్నారు. గతంలో మెట్రో నగరాలకే పరిమితమయ్యే సైబర్ నేరాలు.. ప్రస్తుతం అంతటా విస్తరించాయని, ప్రజలు అవగాహన, అప్రమత్తతో ఉండాలని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు.

గత మూడేళ్లలో మోసాలు: ఓటీపీ : 53 | ఓటీపీ లేకుండా : 26 | ఆన్‌లైన్ కొనుగోళ్లు : 11 | ఏటీఎం : 20 | ఉద్యోగాల పేరుతో : 12 | పోలీసు అధికారులమంటూ : 13 | క్రెడిట్/డెబిట్ కార్డు : 27



OUR EXCLUSIVE STORES
GUDUR : 6300026746 | KANDUKURU : 7799984206
KAVALI : 8309527686 | NELLORE : 9392382850
For Franchise enquiries Mail us at stores@twills.in / Ph:9398118797, 7075940605, 9100546696

ఊరట మాట



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: గత కొన్ని రోజులుగా టమాట ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నాణ్యతను బట్టి కిలో రూ. 70పైనే పలుకుతుండటం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీంతో ప్రభుత్వం రాయితీపై వాటిని అందించేందుకు చర్యలు చేపట్టింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుబజార్లలో తక్కువ ధరకు అందించాలని నిర్ణయించింది. బయటి మార్కెట్‌లో ఎంత ఎక్కువ ధర ఉన్నా.. రూ.50కే అందించనుంది. ఆ మేరకు మదనపల్లి, అనంతపురం ప్రాంతాల రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు.



కందుకూరులో రాయితీపై విక్రయాలు

రోజుకు 3వేల టన్నులు

జిల్లా వ్యాప్తంగా నెల్లూరు నగరంలో ఫత్తేఖాన్‌పేట, నవాబుపేట, కావలి, కందుకూరు, పొదలకూరు.. ఇలా మొత్తంగా అయిదు రైతు బజార్లు ఉండగా- రోజువారీ 3వేల టన్నుల వరకు దిగుమతి చేసుకుని.. వీటిల్లో రాయితీపై అందించనున్నారు. దసరా పండగ సమయంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా చేయడంతో పాటు.. ధరలు తగ్గకుంటే.. ఆ తర్వాత కూడా దీన్ని కొనసాగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కుటుంబానికి రెండు కిలోలు


కుటుంబానికి రెండు కిలోల చొప్పున టమాటాలు అందిస్తారు. వినియోగదారులు రైతు బజార్లకు వచ్చే సమయంలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొచ్చి.. వాటిని పొందవచ్చని వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏడీ అనితాకుమారి తెలిపారు. ధర తగ్గే వరకు రాయితీపై అందిస్తామన్నారు.

మద్యం దుకాణాలకు 1,585 దరఖాస్తులు!

11వ తేదీ వరకు గడువు పెంపు



ఈనాడు, నెల్లూరు: జిల్లాలో మద్యం దుకాణాల కోసం మంగళవారం రాత్రి 8 గంటల వరకు 1585 దరఖాస్తులు అందాయి. ఉదయం 11 గంటల వరకు 969 దరఖాస్తులు రాగా.. దాదాపు 11 దుకాణాలకు ఒక్కరూ చేసుకోలేదు. సాయంత్రానికి పరిస్థితి మారిపోయింది. దాదాపు అన్నింటికీ దాఖలయ్యాయి. మొత్తం 182 దుకాణాలకు లైసెన్సుల జారీకి ప్రకటన ఇవ్వగా.. ఎనిమిది రోజుల్లో ఈ దరఖాస్తులు అందాయి. సగటున ఒక్కో దానికి ఎనిమిది చొప్పున వచ్చాయి. ఇక నాన్ రిఫండబుల్ రుసుముల రూపంలో ప్రభుత్వానికి రూ. 30.94 కోట్ల ఆదాయం వచ్చింది. స్వీకరణకు 11వ తేదీ వరకు గడువు ఉండటంతో.. మరిన్ని వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఆ మేరకు చాలా మంది నమోదు చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, కలిగిరి, కోవూరు నియోజకవర్గంలోని ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేట, అనంతసాగరం, చేజర్ల, సైదాపురం, కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం మండలాల్లో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. లింగసముద్రం మండలంలో రెండు దుకాణాలు ఉండగా.. ఒక్కోదానికి 24 వేశారు. సైదాపురం మండలంలో నాలుగింటికి 90 దాఖలు చేయడం గమనార్హం.



మన వారైతే.. సరే!

వైద్య ఆరోగ్యశాఖలో అక్రమ డిప్యుటేషన్లు
పీహెచ్‌సీల్లో వైద్య సేవలపై ప్రభావం




ఓ వైపు వైద్యుల కొరత ఉంటే.. మరోవైపు దగ్గరి ప్రాంతాల్లో విధులు నిర్వహించడమే లక్ష్యంగా అక్రమ డిప్యుటేషన్లపై పలువురు పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారు 10 మందికిపైగా ఉన్నట్లు తెలిసింది.

న్యూస్‌టుడే, నెల్లూరు(వైద్య విభాగం)

విస్తృత కార్యక్రమాల అమలుతో పాటు నిరంతరం ప్రజారోగ్యం నిమిత్తం పనిచేయాల్సి ఉండటంతో వైద్యఆరోగ్యశాఖలో కొన్ని మినహాయింపులు ఇస్తూ డిప్యుటేషన్లు రద్దు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా డిప్యుటేషన్లు, వర్క్ అలాట్‌మెంట్ చేయాలంటే అనుమతి తప్పనిసరి. కాగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవసరానికి మించి డిప్యుటేషన్లు కొనసాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

- ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు పనిచేయాలి. ఒకరు ఆసుపత్రిలో.. మరొకరు 104 వాహనం ద్వారా సేవలందించాలి. డిప్యుటేషన్ కారణంగా కలిగిరి, చాకలికొండలో ముగ్గురు వైద్యులే పని చేస్తున్నారు. దీనివల్ల ఓ వైద్యుడు ఒక ఆసుపత్రిలో మూడు రోజులు, మరో ఆసుపత్రిలో మిగిలిన రోజులు పనిచేస్తున్నారు. ఫలితంగా వైద్య సేవలు సరిగా అందడం లేదని ప్రజలు అంటున్నారు.



మొత్తంగా 35 మందికిపైగా...

పీహెచ్‌సీల్లో పనిచేయాల్సిన పలువురు వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఏదో ఒక నెపంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, చుట్టుపక్కల పనిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పలుచోట్ల పనిచేసే ఎంపీహెచ్‌ఈవోలు, హెల్త్ ఎడ్యుకేటర్లు, పీహెచ్ ఎన్‌లు, మహిళా ఆరోగ్య పర్యవేక్షకులు, ఫార్మాసిస్టులు, హెల్త్ సూపర్‌వైజర్లు ఇలా కొనసాగుతున్నారు. పీహెచ్‌సీల పరిధిలో పనిచేసే పలువురు మగ హెల్త్ అసిస్టెంట్లను డిప్యుటేషన్ వేసినట్లు సమాచారం. ఇలా వైద్యులు, కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులు.. మొత్తంగా 35మందికి పైగా ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రభావం గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలపై పడుతోంది.

అవసరమైన చోటే...

ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కొన్ని ఖాళీలు ఉన్న చోట.. అవసరం మేరకు డిప్యుటేషన్లపై కొందరు పనిచేస్తున్నారు.

– పెంచలయ్య, డీఎంహెచ్‌వో

(c) eenadu

మహాలక్ష్మి దీవించమ్మా


కందుకూరు పట్టణం : కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గాదేవి


వరికుంటపాడు: మహాలక్ష్మీదేవిగా నాగార్పమ్మ

న్యూస్‌టుడే బృందం : జిల్లాలో శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని కోవూరురోడ్డు దుర్గాభవాని ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆరో రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి రూ.20.40 లక్షలు కొత్త కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. కరెన్సీ నోట్లతో దర్శనమివ్వడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. అష్టోత్తరం, కుంకుమపూజ నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.




సీతారామపురం : ఘటిక సిద్ధేశ్వరంలో మహాలక్ష్మీదేవిగా ఇష్టకామేశ్వరి.. నెల్లూరు రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కాళికాదేవి అలంకారం.. అష్టలక్ష్మి ఆలయంలో విజయలక్ష్మిగా..

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 14 నాన్ టీచింగ్ పోస్టులు ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ సీహెచ్ ఉషారాణి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో చేసి ఆయా ఎంఈవోల కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్-9, పగలు, రాత్రి ఉమెన్ వాచ్‌మెన్-2, స్కావెంజర్- 2, స్వీపర్- 1 ఖాళీ ఉన్నాయని అన్ని పోస్టులకు స్థానికులు అర్హులని.. వివరాలకు జిల్లా సమగ్రశిక్షా కార్యాలయం, ఆయా కేజీబీవీల్లో సంప్రదించాలన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి విద్యార్థి ఎంపిక

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎ.గణేశ్ ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్ శిబిరానికి ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ ఎం.రవికుమార్ తెలిపారు. గత నెలలో ఏఎన్‌యూలో జరిగిన వెస్ట్‌జోన్ ఎంపికల్లో ఇతను ప్రతిభ చూపాడన్నారు. ఈ మేరకు నవంబరు 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జలగావ్‌లో శిక్షణ పొందుతాడని వివరించారు. శిక్షణలో ప్రతిభ చూపిన వారికి 2025 జనవరి 26న దిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారన్నారు.

ఇంటింటా సౌర వెలుగులు

పీఎం సూర్యఘర్ పథకానికి ఆదరణ



న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

సౌర విద్యుత్తును ప్రతి ఇంటికి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం స్యూర్‌ఘర్' ఉచిత విద్యుత్తు పథకానికి జిల్లాలో ఆదరణ లభిస్తోంది. పథకం ద్వారా సౌర పలకల యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అవసరం మేరకు వినియోగించుకుని మిగిలిన యూనిట్లను విక్రయించుకోవచ్చు. దీనికి ప్రభుత్వమే రాయితీ అందించి, బ్యాంకు రుణాలను ఇప్పించి ఇంటిపై యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంది.


రూ.78 వేల రాయితీ

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి గృహాలకు సౌర విద్యుత్తు ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలో వాట్ల యూనిట్‌కు రూ. 78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది. అందులో కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్లకు రూ. 78 వేల చొప్పున రాయితీ అందిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ. 1.45 లక్షలు ఖర్చవుతుంది. అందులో కేంద్రం గరిష్ఠంగా రూ. 78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచికత్తు లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.

1,400 మంది వినియోగదారులకు అనుమతి

జిల్లా వ్యాప్తంగా సూర్యఘర్ పథకానికి 1,448 మంది వినియోగదారులు దరఖాస్తు చేసుకోగా వాటిని పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు 1,400 కనెక్షన్లకు అనుమతులు ఇచ్చారు. వీటిలో ఇప్పటివరకు 77 సర్వీసులు పూర్తిస్థాయిలో వారి ఇంటిపై, సంస్థలపై సోలార్ విద్యుత్తు పలకలను అమర్చుకున్నారు. ఇందులో భాగంగా 12 మంది వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వ రాయితీ వారి ఖాతాల్లో జమైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ పలకలు ఏర్పాటు చేసుకుని 288 కిలో వాట్స్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం పథకానికి విరివిగా రాయితీ రుణాలు అందిస్తోంది. ఇప్పటివరకు 1400 కనెక్షన్లకు అనుమతులు ఇచ్చాం. వీటిలో 77 రన్నింగ్‌లో ఉన్నాయి. ఏర్పాటు చేస్తున్న అన్నింటికీ కేంద్రం రాయితీ వస్తుంది. విస్తృత ప్రచారం ద్వారా పథకాన్ని విద్యుత్తు వినియోగదారుల్లోకి తీసుకుపోతున్నాం. సందేహాలు ఉంటే ఏఈలను కలవాలి. **– వి.విజయన్, ఎస్ఈ**

టిడ్కో ఇళ్లల్లో సమస్యలు పరిష్కరిస్తాం


టిడ్కో ఇళ్లు పరిశీలిస్తున్న అజయ్‌కుమార్

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: టిడ్కో ఇళ్లు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి.. వాటన్నింటినీ లబ్ధిదారులకు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నెల్లూరు వచ్చిన సందర్భంగా అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. స్థానికంగా శాంతి భద్రతలు, తాగునీరు, వీధి దీపాలు సమస్యలు ఉన్నాయని, వాటిపై.. సంబంధిత అధికారులతో మాట్లాడానని పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు. చాలావరకు ఇళ్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలంటే చిన్న చిన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అందుకే వాటిపై దృష్టి సారిస్తామన్నారు. ఆయన వెంట నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మ, టిడ్కో ఈఈ ఉమా శంకర్ శాస్త్రి, జనసేన నాయకులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, షేక్ ఆలియా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించండి


మాట్లాడుతున్న డీఐఓ ఉమామహేశ్వరి

మనుబోలు : మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయకుండా పనిచేయాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.

షట్టర్లకు అత్యవసర మరమ్మతులు

కనిగిరికి తరలిన నీళ్లు


మరమ్మతులు చేస్తున్న సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఈఈ జనార్దన్

సంగం, న్యూస్‌టుడే: సంగం బ్యారేజీ నుంచి కనిగిరి జలాశయానికి ఎట్టకేలకు రెండు వేల క్యూసెక్కుల చొప్పున సాగునీటి తరలింపు మొదలైంది. కనిగిరి జలాశయం ప్రధాన కాలువలోని క్రాస్‌రెగ్యులేటర్‌లో ఉన్న అయిదు షట్టర్లలో నాలుగు పనిచేయకపోవడం.. ఒకదాని ద్వారానే నీరు వెళుతుండటంతో నెలకొన్న ఇబ్బందులపై 'లేవని షట్టర్లు.. కనిగిరికి కన్నీళ్లు' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై సోమశిల జలాశయం అధికారులు స్పందించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నుంచి జలవనరులశాఖ మెకానికల్ విభాగం డీఈఈ జనార్దన్‌రెడ్డితో పాటు బెజవాడ పాపిరెడ్డి కాలువ డీఈఈ మహేశ్, ఏఈ రమణ తదితరులు రెగ్యులేటర్‌ను పరిశీలించారు.

స్పందనకు వందనం

గతంలో షట్టర్లను ఏర్పాటు చేసిన గుత్తేదారుడు.. మరమ్మతులు చేసే సిబ్బందిని తీసుకొచ్చారు. వారి సాయంతో మరొక షట్టరు తెరవడంతో.. రెండు వేల క్యూసెక్కుల నీటి తరలింపునకు మార్గం సుగమమైంది. సంగం బ్యారేజీ వద్ద నీటి మట్టం గణనీయంగా తగ్గింది. ఈ సందర్భంగా డీఈఈ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ. 65 లక్షల వ్యయంతో మరమ్మతులకు చేసిన ప్రతిపాదనల స్థితిగతులను స్వయంగా పరిశీలించి నిర్ధారిస్తే, ప్రభుత్వం అనుమతిస్తుందన్నారు. అందుకోసమే వచ్చానన్నారు. అయిదేళ్లుగా కనీస నిర్వహణ కొరవడటంతోనే షట్టర్లు దెబ్బతిన్నాయన్నారు. డీఈఈ మహేశ్ మాట్లాడుతూ.. తొలిపంట సాగు నాటికి షట్టర్ల పనితీరు మెరుగుపడుతుందన్నారు. గుత్తేదారు మాట్లాడుతూ.. తాను ఈ పనులను 2018 నాటికి పూర్తి చేసినా.. ఇటీవలే బిల్లులు పూర్తిస్థాయిలో పొందానని వివరించారు.

ఆహ్వాన కమిటీ ఏర్పాటు

నెల్లూరు(సాంస్కృతికం) : మత సామరస్య పరిరక్షణకు రాష్ట్ర ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ముందుకు రావాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర మహాసభల నిర్వహణ ఆహ్వాన సంఘం ఏర్పాటు సభ టౌన్‌హాల్‌లో మంగళవారం జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మూడు రోజుల పాటు నెల్లూరులో రాష్ట్ర మహాసభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులు పాల్గొని మహాసభల నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. రమేష్, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కళ్లలో వేదన.. కన్నీటి నివేదన

మా చెల్లి కష్టంతో...



మా అమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. అమ్మమ్మ ఇంట్లోనే ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛనే ఆధారం. నా చెల్లి ఇంటర్‌తో చదువు ఆపేసి.. చిరుద్యోగిగా పని చేస్తూ.. నన్ను నర్సింగ్ చదివించింది. శిక్షణ పూర్తయింది. ధ్రువపత్రాలు ఇస్తే.. ఏదో ఉద్యోగం చూసుకుంటా. ఇంటికి ఆదరవుగా నిలుస్తా. ఇవ్వడం లేదు. అదేమంటే ఫీజు బకాయిలు చెల్లించాల్సిందేనని కళాశాల యాజమాన్యం తేల్చి చెబుతోంది. అయిదు రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నా. ఎంత వేడుకున్నా ఇవ్వడం లేదు. అధికారులు చెప్పినా ససేమిరా అంటున్నారు. దిక్కుతోచడం లేదు. **- రాజపు ప్రమీల, శ్రీకాకుళం**

ఎక్కడి నుంచి తేగలం



మా అమ్మ గృహిణి. నాన్న కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. నేను వైద్యురాలు కావాలన్నది వారి ఆశ. కుటుంబ పరిస్థితులు సహకరించక నర్సు ట్రైనింగ్ చేశా. నాన్న అప్పులు చేసి చదివించారు. ధ్రువపత్రాలు ఇస్తే.. ఏదో ఒక ఉద్యోగంలో చేరి కుటుంబానికి ఆధారంగా నిలవాలనుకుంటున్నా. రూ. 50వేలు ఇస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామంటున్నారు. ఎక్కడి నుంచి తేవాలి. రెక్కల కష్టంతో బతికే మా అమ్మానాన్న అంత మొత్తం ఎలా ఇస్తారు. చేతిలో చిల్లిగవ్వలేదు. ఇబ్బంది పడుతున్నా. **- వల్లంగి లక్ష్మి, తుని**


విలపిస్తున్న యువతులు

న్యూస్‌టుడే, కావలి

కావలిలోని ఓ ప్రైవేటు కళాశాలలో నర్సింగ్ విద్య పూర్తి చేసిన ఇతర జిల్లాల యువతుల ఆవేదన ఇది. శిక్షణ పూర్తి చేసుకున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని.. ఫీజు బకాయిలు చెల్లించనిదే ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేది లేదని కళాశాల యాజమాన్యం తేల్చి చెప్పగా.. తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అంత డబ్బు చెల్లించలేమంటూ.. ధ్రువీకరణ పత్రాలకు యత్నిస్తూ.. ఆ యువతులు పడుతున్న ఆవేదన అంతా ఇంతా కాదు.. గత ప్రభుత్వ తప్పిదానికి ఇప్పుడు విద్యార్థులు అవస్థలు పడుతున్న దుస్థితి.. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, తుని తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 20 మంది యువతులు పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో విద్య అభ్యసించారు. పరీక్షల ఫలితాలు విడుదల కావడంతో.. ఉత్తీర్ణత పత్రాలు తీసుకునేందుకు అయిదు రోజుల కిందట వచ్చారు. ఫీజు బకాయి ఉందని, చెల్లిస్తేనే వాటిని ఇస్తామని యాజమాన్యం మెలిక పెట్టింది. అదేమంటే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదని తేల్చేసింది. తర్వాత ఎలాగోలా చెల్లిస్తామని ప్రాధేయపడినా ఫలితం లేకుండా పోయింది. అసలే అంతంత మాత్రం ఆర్థిక స్థోమత.. పట్టణంలో ఎక్కడా వసతి లేకపోవడంతో బస్టాండ్, రైల్వేస్టేషన్లలో సేద తీరుతూ.. ధ్రువపత్రాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. కడుపు నిండా తిండి లేకున్నా.. సర్టిఫికెట్లు ఇస్తే చాలని వేడుకుంటున్నారు. వీరి పరిస్థితిని గమనించిన జనసేన నాయకులు, స్థానికంగా పరిచయస్తులు తాత్కాలిక వసతి కల్పిస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో...

కలెక్టర్ ఆదేశాలతో.. ఆర్డీవో కళాశాల యజమాని, బాధిత యువతులతో మంగళవారం చర్చించారు. ఫీజు చెల్లించే వరకు ధ్రువపత్రాలు ఇచ్చేది లేదని కళాశాల యజమాని తేల్చి చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి మొత్తాలకు(రూ. 50వేల చొప్పున) చెక్కులపై సంతకాలు పెట్టించుకుని ధ్రువపత్రాలు ఇవ్వాలని ఆర్డీవో సూచించారు. ప్రభుత్వం నుంచి నిధులు జమ కాగానే.. ఆ నిధులు తీసుకుని.. డబ్బు, చెక్కులు తిరిగి ఇవ్వాలని స్పష్టం చేశారు. ఎట్టకేలకు దానికి అంగీకరించిన కళాశాల యజమాని.. ఈ నెల 20వ తేదీ నాటికి ఇచ్చేలా అధికారుల సమక్షంలో అంగీకరించారు.

రూ. 57.73 కోట్లతో.. 1009 పనులు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: పల్లె పండగ పంచాయతీరాజ్ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో రూ. 57.73 కోట్లతో 1009 పనులు చేపట్టనున్నట్లు కలెక్టర్ ఆనంద్ వివరించారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే పల్లెపండగ కార్యక్రమంపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అమరావతి నుంచి నిర్వహించిన వీక్షణ సమావేశంలో.. కలెక్టర్ కలెక్టరేట్ నుంచి భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులకు ఇసుక, సిమెంట్ కొరత లేదని, జనవరి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ వెంకటరమణ, జడ్పీ ఉప సీఈవో మోహన్‌రావు పాల్గొన్నారు.

నేడు రెండోడిపో పరిధిలో డయల్ యువర్ డీఎం

నెల్లూరు(రవాణా) : నెల్లూరు రెండో డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సూచనలకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు మేనేజర్ శివకేష్ యాదవ్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు 99592 25642 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కార్యాలయం మార్చే అధికారం ఎవరిచ్చారు..?

పొదలకూరు, న్యూస్‌టుడే: ఒకటో సచివాలయంలో నిర్వహిస్తున్న పొదలకూరు మేజరు పంచాయతీ కార్యాలయాన్ని నూతన భవనంలోకి ఎవరి ప్రమేయంతో మార్చారని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను తెదేపా నాయకులు ప్రశ్నించారు. మంగళవారం తెదేపా మండల అధ్యక్షులు మస్తాన్‌బాబు మాట్లాడుతూ.. మేజరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దొరబాబు పనిచేస్తూ ఈనెల 5న బదిలీపై వెళుతూ కార్యాలయ తాళాలు ఉప సర్పంచికి అప్పగించి వెళ్లారన్నారు. సిబ్బంది కార్యాలయంలో కొన్ని కీలక దస్త్రాలను మార్చేయడం, వాటిని తొలగించారన్న అనుమానం ఉందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంపీడీవో నరసింహారావు మాట్లాడుతూ ఇటీవల బాధ్యతలు తీసుకున్నామని రెండు రోజుల్లో అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.


పూర్వ కార్యదర్శి దొరబాబును ప్రశ్నిస్తున్న తెదేపా నాయకులు

క్రీడా కుసుమాలు
బాస్కెట్‌బాల్ మెరికలు

ఉత్తమ క్రీడాకారుడిగా రాణించేందుకు వెంకట సాయి వశిష్ట కృషి



ఒంగోలుకు చెందిన కె.రాహుల్‌బాబు, సత్యగౌతమి దంపతుల కుమారుడు వెంకటసాయి వశిష్ట. ఒంగోలు మున్సిపల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తండ్రి ప్రైవేటు ఉద్యోగి, తల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి ఖోఖో క్రీడ సాధన చేస్తున్నాడు. గతేడాది నుంచి బాస్కెట్‌బాల్ సాధన ప్రారంభించాడు. ప్రస్తుతం జిల్లా జట్టుకు ఎంపికై శిక్షణ పొందుతున్నాడు. బాస్కెట్‌బాల్‌లో నైపుణ్యం పెంచుకుని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ క్రీడాకారుడిగా రాణించాలన్నది తన లక్ష్యంగా చెబుతున్నాడు.


బాస్కెట్‌బాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు

రెండోసారి రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీనాథ్



లింగసముద్రం మండలం కొండారెడ్డిపాలేనికి చెందిన వెంకట్రావు, నాగమణి కుమారుడు శ్రీనాథ్. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతూ బాస్కెట్‌బాల్ సబ్‌జూనియర్స్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు బేల్దారీ కూలీలు. ఉపాధ్యాయుల సూచనల మేరకు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకున్నాడు. బాస్కెట్‌బాల్‌లో నైపుణ్యం సాధించి గతేడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. ప్రస్తుతం రెండోసారి రాష్ట్ర పోటీల్లో ప్రాతినిధ్యం వహించబోతున్నాడు. ఉత్తమ ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించడమే లక్ష్యమంటున్నాడు.


కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపుతోపాటు ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఉపాధ్యాయులు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు ఆ విద్యార్థులు. ఒకపక్క విద్యలో రాణిస్తూనే తమకు ఇష్టమైన బాస్కెట్‌బాల్ క్రీడను ఎంచుకుని అందులో నైపుణ్యం సాధించారు. ఈ నెల 5న టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన సబ్‌జూనియర్స్(అండర్-14) బాలుర బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు గత నాలుగు రోజుల నుంచి టీఆర్ఆర్ కళాశాల మైదానంలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు.

స్నేహితుడితో కలసి ధర్మతేజ సాధన



టంగుటూరు మండలం కలికవాయకు చెందిన మోహన్‌రావు, భువనేశ్వరి దంపతుల కుమారుడు ధర్మతేజ. పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. తోటి స్నేహితుడు బాస్కెట్‌బాల్ ఆడుతుంటే చూసి తాను కూడా సాధన చేశాడు. ఆర్నెల్లలోనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. మొదటిసారి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నాడు. ఎలాగైనా కష్టపడి పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నాడు.


ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా జస్వంత్‌రెడ్డి



కందుకూరు మండలం మాచవరానికి చెందిన రమణారెడ్డి, విజయలక్ష్మి కుమారుడు జస్వంత్‌రెడ్డి. తల్లిదండ్రులు వ్యవసాయదారులు. జస్వంత్‌రెడ్డి మాచవరం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చనే మాటలను స్ఫూర్తిగా తీసుకున్నాడు. బాస్కెట్‌బాల్, ఖోఖో రెండు విభాగాలకు సంబంధించి జిల్లా జట్లకు ఎంపికయ్యాడు. మరింత రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది తన లక్ష్యమని చెబుతున్నాడు.

తల్లిదండ్రుల స్ఫూర్తితో ముందుకు

- పి.మౌలిలోకేశ్



కావలికి చెందిన మల్లికార్జున, పద్మ దంపతుల కుమారుడు మౌలిలోకేశ్. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం. పట్టణంలోని ప్రభుత్వ బీసీ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్నాడు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో బాస్కెట్‌బాల్ సాధన చేసి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రుల స్ఫూర్తితో మెరుగ్గా రాణించి ఉన్నత స్థాయికి చేరుకుంటానని ధీమా వ్యక్తం చేశాడు.

ఎదురొచ్చే వాహనాలు వెళ్లేదెలా?



సంగం శివారులో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఇసుక లారీల రద్దీ నెలకొంది. రోడ్డుకిరువైపులా ఇలా బారులుదీరడంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులేర్పడ్డాయి. ఇక్కడ పరిస్థితి చూస్తే.. వన్ వేనా?! అనే సందేహం తలెత్తుతోంది. పోలీసులు పరిశీలించి.. వాహనాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, సంగం**

ఓటరు జాబితా తయారు చేయండి

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నందున రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా ఓటరు జాబితా తయారు చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, జడ్పీ ఉప సీఈవో మోహన్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీఈవో రామారావు, సమగ్రశిక్షా ఏపీసీ ఉషారాణి, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాము ధర:	రూ. 7,298
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 58,384
వెండి గ్రాము :	రూ. 95.70

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	124
రిటైల్	146
లేయర్	110
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	241
లేయర్ మాంసం	187
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	134
లేయర్	110
బ్రాయిలర్స్	240
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	264
లేయర్ మాంసం	187

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

నెల్లూరు నగరంలో మదర్ ల్యాండ్ డెవలపర్స్ వారి నూతనంగా నిర్మించుచున్న ప్రీమియం అపార్ట్‌మెంట్స్ (రెయిన్ స్క్వేర్ థియేటర్ వెనుక & శాంతినగర్) నందు 2 BHK & 3 BHK Flats అమ్మకమునకు కలవు. Ph: 79954 22204, 79954 22201

బాలాజీనగర్ పుట్టవీధిలో సత్యనారాయణ టవర్స్, 3వ ఫ్లోర్ ఈస్ట్ ఫేసింగ్, 1572 Sft, 3BHK ఫ్లాట్ అమ్మబడును. నో మీడియేటర్స్, Only Direct Parties. ✆ 62816 08824

PLOT FOR SALE

నెల్లూరుకు దగ్గరలో నరుకూరు సెంటర్‌లో DTCP ప్లాట్స్ అంకణం 80 వేలు, NUDA Aporoved ప్లాట్స్ 90 వేలకే అమ్మబడును. బ్యాంక్‌లోన్ సౌకర్యం కలదు. సెల్ : 62814 11178, 91214 52347

JOBS

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం.18k . ✆ 96402 58899, 96404 68899.

JVR షాపింగ్ మాల్. కోమల విలాస్ దగ్గర, ట్రంకురోడ్డు, నెల్లూరు నందు క్యాషియర్స్ మరియు కిడ్స్‌వేర్, డ్రెస్ మెటీరియల్ సెక్షన్స్‌లో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్, సేల్స్ బాయ్స్, హెల్పర్స్ కావలెను. నేరుగా సంప్రదించండి.

శ్రీజ డయాగ్నస్టిక్స్ నందు పనిచేయుటకు ల్యాబ్ టెక్నీషియన్స్ & రిసెప్షనిస్ట్ కావలెను. Contact: 84660 10066

Wanted Field Executives for Central Govt. Projects Sal: 30K Q: Dip. / Degree, Other Posts - Q: 10th / Inter / ITI Exam at Vizag ✆ 7207946889, 7207646889.

కావలెను

ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్‌కు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, రిసెప్షనిస్ట్‌లు కావలెను. ఆకర్షణీయమైన జీతం.

PRIME HOSPITAL

TDP Office ప్రక్కన, మిని బైపాస్, నెల్లూరు. 93981 18239

TOURS AND TRAVELS

గురువాయూరు, బాహుబలి పాల్స్, విష్ణుమాయ, పొలాచ్చి, సేలం, ఈషా 19.10.24 తేదీ 3 రోజులు, టికెట్ 4500 (AC బస్సు) K.వాసు, నెల్లూరు. ✆ 94913 40504

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...

B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

వివరాలకు..

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

పంట నమోదులో అవకతవకలు జరగరాదు: సబ్‌కలెక్టర్



పంట నమోదును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

వరికుంటపాడు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు ప్రక్రియలో అవకతవకలు జరగకుండా నమోదు చేయాలని కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ ఆదేశించారు. మండలంలోని గువ్వాడిలో ఈ పంట నమోదును మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న పంట, నమోదైన వాటి వివరాలను ఆరా తీశారు. రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్‌కుమార్, ఉదయగిరి ఏవో అంజనేయులునాయక్, వీఆర్వో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చితీగల తొలగింపు

స్పందనకు వందనం

వరికుంటపాడు : మండలంలోని మాదనగర్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలకు అల్లుకున్న పిచ్చిమొక్కలను అధికారులు తొలగించారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడడంతోపాటు ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనిపై గత నెల 27న 'నిర్లక్ష్యం అల్లుకుంటోంది!' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. లైన్‌మెన్ వెంకటేశ్వర్లు మంగళవారం స్తంభాలకు అల్లుకుపోయిన వీటిని తీసివేయించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: లింగరాజు అగ్రహారంలో ర.భ రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. ఈ ప్రాంతమంతా దుర్వాసన భరించలేని విధంగా మారింది. - **ప్రసాద్, లింగరాజు అగ్రహారం**

సమాధానం: గ్రామస్థులకు అవగాహన కల్పించి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - **సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి, లింగరాజు అగ్రహారం - న్యూస్‌టుడే, జలదంకి**

? పట్టణంలోని యూనియన్ రోడ్డు రోడ్‌దార్ వీధికి వెళ్లే మార్గంలో బావి వద్ద చెత్త పేరుకుపోయింది. - **ఖదర్‌బాషా, స్థానికుడు**

✓ పారిశుద్ధ్య కార్మికులతో తీయిస్తాం. - **కరిముల్లా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఉదయగిరి**

? మా గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంటు నీరు అపరిశుభ్రంగా ఉంటుంది. శుద్ధి చేసి సరఫరా చేయాలి. - **డి. కృష్ణ, గరిమెనపెంట**

✓ పరిశీలించి శుభ్రమైన నీరు అందించేలా చర్యలు తీసుకుంటాం. - **వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, -కొండాపురం, న్యూస్‌టుడే**

? మండలంలోని పాపంపల్లి వెళ్లే రహదారి రాళ్లు తేలి అధ్వానంగా ఉంది. - **సుబ్బారెడ్డి**

✓ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో రోడ్డు వేస్తాం. - **రవీంద్రనాథ్, పీఆర్ ఏఈ - న్యూస్‌టుడే, దుత్తలూరు**

? స్థానిక పోలీస్‌స్టేషను ఎదుట రహదారి అంచుల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **-కేవీ శరత్, స్థానికుడు**

✓ పారిశుద్ధ్య కార్మికులకు తెలియజేసి.. సరిచేయిస్తాం. **-వెంకటేశ్వరరావు, ఎంపీడీవో**
- న్యూస్‌టుడే, కందుకూరు, గుడ్లూరు

దుర్గమ్మా.. శరణు.. శరణు





కావలి: అన్నపూర్ణగా కావలి కనకదుర్గమ్మ, సీతారామపురం: బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో వాసవీకన్యకాపరమేశ్వరి

కావలి, కందుకూరు, ఉదయగిరి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా చేస్తున్నారు. మంగళవారం అమ్మ వారికి ప్రత్యేక అలంకారం చేశారు. పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు.



మహాలక్ష్మికి భక్తుల పూజలు



ఉదయగిరి: శివాలయంలో మహాలక్ష్మి అలంకారంలో పార్వతీదేవి అమ్మవారు

అధ్వాన దారులు.. ప్రజలకు కష్టాలు

పట్టణంలో ఇదీ పరిస్థితి	పట్టణ విస్తీర్ణం : 69.01 చదరపు కి.మీ	మొత్తం రహదారులు : 264 కి.మీ	మట్టి రోడ్లు : 70 కి.మీ	తారురోడ్లు : 12 కి.మీ



ఈ చిత్రం కావలి పట్టణంలోని కచ్చేరిమిట్టలో అంతర్గత రహదారి. సిమెంటు రోడ్డుగా నిర్మించినా అనతి కాలంలోనే ధ్వంసమైంది. వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

న్యూస్‌టుడే, కావలి

పట్టణంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పురపాలక సంఘ పరిధిలో చాలా రోడ్లు దెబ్బతిన్నాయి. కొత్తగా నిర్మించాల్సిన వాటితోపాటు పాతవి దెబ్బతిన్న స్థానంలో నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఉంది.

● పట్టణంలోని చాలా ప్రాంతాల్లో వివిధ కేబుల్ వైర్లు, పైపులైన్‌ల నిమిత్తం అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. వ్యక్తిగత కుళాయి కనెక్షన్లకు తవ్వినప్పుడు సబంధిత దరఖాస్తుదారులే బాగు చేయాలనే నిబంధనలు అమలవడం లేదు. తవ్వేసి వదిలేస్తున్నారు. ఎంత పటిష్ఠంగా నిర్మించిన రోడైనా వివిధ కారణాలతో తవ్వినప్పుడు తిరిగి సరిదిద్దకపోవడంతో మూణ్నాళ్లకే ఛిద్రమవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో ఎవరికి వారు స్పీడ్ బ్రేకర్లను నిర్మించుకుంటున్నారు. వీటి కారణంగా ఆయా ప్రాంతాల్లో గుంతలు పడుతున్నాయి. వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాత్రిళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణ శివారులోని ఇందిరమ్మ కాలనీ, సుచేతనగర్ కాలనీ, బాలకృష్ణారెడ్డినగర్, ముసునూరు, మద్దూరుపాడు, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లో రహదారులు మట్టితో ఉన్నాయి. వర్షాలు కురిస్తే బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలకు నరకయాతన పడుతున్నారు.



ఇది పాతూరులోని అళహరివారివీధి, షాదీమంజిల్, వివేకానంద పార్కు, తదితర ప్రాంతాల్లోని రహదారి. కొంతదూరం ఓ వైపు మురుగుకాలువతో సమానంగా తయారైంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి.

రూ.10 కోట్లతో అంచనాలు పంపాం

శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి

రూ.10 కోట్లు కావాలని నుడాకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో రావచ్చు. ఆ తరువాత విడతల వారీగా అన్ని రోడ్లను మెరుగుపరుస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

వంతెనపై ప్రమాదకరంగా గుంత

మండలంలోని బోయలపాడు నుంచి వేములపాడు పోయే ర.భ రోడ్డుపై పంట కాలువ మీద వంతెనపై పడిన పెద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం దీని మీదుగా బోయలపాడు, వేములపాడు, కోదండరామాపురం తదితర గ్రామాలకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ర.భ ఏఈ అహ్మద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కొత్త వంతెన నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, జలదంకి**



నిరుపయోగంగా సింథటిక్ ట్యాంకు



పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధి ప్రజలకు ఏర్పాటుచేసిన సింథటిక్ ట్యాంకు కొన్నాళ్లుగా నిరుపయోగంగా ఉందని స్థానికులు తెలిపారు. నీరు నింపకపోవడంతో అవసరాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కుళాయిల ద్వారా వదిలిన నీటితో సరిపెట్టుకుంటున్నామన్నారు. ట్యాంకు దిమ్మెకు పెట్టిన కుళాయిలు కూడా దెబ్బతిన్నాయన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి కరిముల్లా దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, ఉదయగిరి**

వంతెన నిర్మాణమెప్పుడో?

మండలంలో పెద్దపాడు నుంచి శిద్ధనకొండూరు వెళ్లే మార్గంలో వాగుల వద్ద రహదారి దారుణంగా ఉంది. ఈ మార్గంలో మూడు వాగులు ఉన్నాయి. వాగులపై వంతెన నిర్మాణం లేకపోవడంతో వాహనదారులు వాగులు దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ రవీంద్రనాథ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తూముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. నిధులు మంజూరైతే పనులు చేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కలిగిరి**



డంపింగ్‌యార్డు నిర్వహణ అస్తవ్యస్తం

మున్సిపాలిటీని దశాబ్దాల తరబడి వేధిస్తోన్న డంపింగ్‌యార్డు సమస్య మరింత జటిలమవుతోంది. డంపింగ్‌యార్డు మొత్తం చెత్తాచెదారంతో నిండిపోయింది. ప్రస్తుతం రోజూ వచ్చే చెత్తను డంపింగ్‌యార్డు బయట రోడ్ల పైనే పోస్తుండటంతో అటుగా రాకపోకలు చేసే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పోతురాజుమిట్ట వైపు నుంచి వెళ్లే రోడ్డు పూర్తిగా చెత్తతో బ్లాక్‌చేశారు. కాగా డంపింగ్‌యార్డు సమస్యను అతి త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ కె. అనూష తెలిపారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**



పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

న్యూస్‌టుడే, కలిగిరి

మండలంలోని వెలగపాడు నుంచి కొత్తూరు మీదుగా పెద్దపాడు వరకు మంజూరైన తారు రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 7 కి.మీ రహదారి అభివృద్ధికి 2019లో సుమారు రూ. 5 కోట్ల నిధులు అప్పట్లో మంజూరయ్యాయి. నాటి మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారింది. ప్రభుత్వం మార్పిడి కారణంగా గుత్తేదారు ఆలస్యంగా పనులు ప్రారంభించారు. సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు నిలిచిపోయాయి. నాలుగేళ్లుగా ఈ రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

సగం పనులతో అవస్థలు

రోడ్డు పనుల్లో భాగంగా గతంలో ఉన్న మట్టి రోడ్డును వెడల్పు చేశారు. వంతెనలు, కల్వర్టుల నిర్మాణం పూర్తిచేశారు. విస్తరించిన మట్టి రోడ్డుపై కంకర మిశ్రమం (వెట్‌మిక్స్) వేశారు. అనంతరం తారురోడ్డు వేయాల్సి ఉంది. ప్యాకేజీలో తొలుత చేపట్టిన పనులకు సక్రమంగా బిల్లులు మంజూరు కాలేదనే కారణంతో గుత్తేదారు మూడేళ్లుగా జాప్యం చేస్తున్నారు. ఇది పూర్తయితే పెద్దపాడు, కొత్తూరు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం. ప్రస్తుతం నిర్మిత మైన మట్టి రోడ్డు గుంతలమయంగా మారింది.



గోతుల్లో నిల్వ చేరిన వర్షపునీరు

వర్షం వస్తే గోతుల్లో నీరు చేరుతోంది. ప్రయాణం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కలిగిరి-సంగం రోడ్డుపై వెలగపాడు క్రాస్ రోడ్డు నుంచి కొత్తూరు మీదుగా కలిగిరి- కావలి మధ్య దూరం తగ్గుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇప్పుడైనా త్వరితగతిన రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ రవీంద్రను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గత ప్రభుత్వంలో పనులు నిలిచాయన్నారు. ప్యాకేజీలో తొలుత చేసిన పనులకు బిల్లులు మంజూరు కాలేదన్నారు. దీంతో మిగిలిన పనులు చేసేందుకు గుత్తేదారు జాప్యం చేశారన్నారు. ఉన్నతాధికారులకు సమస్య వివరిస్తామన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, గుడ్లూరు : మండలంలోని ఆశా కార్యకర్తలు గ్రామాల్లో జ్వరాల తీవ్రతను గుర్తించాలని వైద్యాధికారి మారుతీరావు అన్నారు. మంగళవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించేలా సూచనలివ్వాలన్నారు. సీహెచ్‌వో భాస్కరరావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

సీతారామపురం : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణులు స్వప్న, భవ్య సూచించారు. సీతారామపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాకార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కృష్ణమ్మ, ఎంపీహెచ్‌ఈవో మజీదు, ఆరోగ్య సహాయకులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి విధిగా చేయాలి

కందుకూరు గ్రామీణం : రైతులు సాగు చేసే పంటలో వేసే విత్తనాలను విధిగా విత్తనశుద్ధి చేసుకోవాలని ఏవో వి.రాము సూచించారు. పాలూరు, ఆనందపురంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి పి.బ్రహ్మసాయి, పశువైద్యాధికారి చెన్నకేశవులు, మార్కెటింగ్ శాఖ అధికారి ఖాసిం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నర్మదానంద బ్రహ్మచారి స్వామీజీ పాదయాత్ర

వలేటివారిపాలెం : నర్మదానంద బ్రహ్మచారి స్వామీజీ పాదయాత్రగాఅష్టాదశ పీఠాల దర్శనానికి శ్రీకారం చుట్టి మంగళవారం రామచంద్రాపురంలో బస చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన నర్మదానది జలకూటి వద్ద ఏర్పడిన శ్రీ రేవా పంచవటి సేవాన్యాస్ ఆశ్రమం నుంచి బయలుదేరారు. ఇప్పటికి 15 పీఠాలు దర్శించారు. బుధవారం రామచంద్రాపురం నుంచి బయలుదేరి వలేటివారిపాలెం మీదుగా లింగసముద్రం చేరుకుంటారని భక్తులు తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు

కావలి : రోగులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు కావలి ప్రాంతీయాసుపత్రి వైద్యులు తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ పద్మావతి మాట్లాడుతూ తాజాగా రెండు అరుదైన శస్త్రచికిత్సలు వైద్యులు నిర్వహించారన్నారు. గర్భిణి కడుపులో కిలో బరువున్న కణితిని తొలగించామన్నారు. ఓ పురుషుడికి సమస్యగా మారిన వరి బీజం తొలగించినట్లు వివరించారు. సేవలువినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్‌ఎంవో ప్రమీల, నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మీప్రసన్న, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చెవల రామకృష్ణ, పబ్బా సాయి తదితరులు పాల్గొన్నారు.

అప్పు విషయమై ఘర్షణ

కావలి : పట్టణంలోని శివరామసుబ్బయ్య కాలనీలో అప్పు విషయమై రెండు కుటుంబాల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. ఇరువర్గాలకు సంబంధించిన వారిలో నలుగురికి గాయాలయ్యాయి. రెండో పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.9 లక్షల సిగరెట్ల చోరీ

అద్దంకి, న్యూస్‌టుడే: పట్టణంలో సిగరెట్ డీలరు దుకాణంలో దొంగతనం జరిగింది. అర్ధరాత్రి దుకాణ షట్టరును పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఎనిమిది సిగరెట్ దిండ్లు అపహరించారు. వీటి విలువ రూ.9 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కావలికి చెందిన వ్యాపారి వైవీ కోటేశ్వరరావు 2012 నుంచి అద్దంకిలో సిగరెట్ అధీకృత డీలరుగా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం దుకాణం మూసివేసిన అనంతరం మంగళవారం ఉదయం నిర్వాహకులు దుకాణం వద్దకు రాగా షట్టరు పైకి లేపి ఉండటాన్ని గమనించారు. ఆమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రత్యేక పోలీసు బృందాలు వచ్చి పరిశీలించాయి. దుకాణం వెలుపల, బయట ఉన్న నిఘా కెమెరాల్లో నిక్షిప్తమైన సీసీ ఫుటేజిని చూస్తున్నారు. దీని ప్రకారం దొంగతనం జరిగిన సమయం, అపహరించిన సరకు వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలో పనిచేస్తున్న వారి చరవాణి నంబర్లు సేకరించారు. సంబంధిత అధీకృత డీలరు నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మానవ హక్కుల పరిరక్షణకు కలిసి పనిచేద్దాం: ఆర్డీవో



ఆర్డీవోతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ప్రతినిధులు

కావలి, న్యూస్‌టుడే: మానవ హక్కుల పరిరక్షణ కోసం అందరం కలసి పనిచేద్దామని ఆర్డీవో ఎం. వంశీకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం మానవ, వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ప్రతినిధులు ఆయన్ను కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోరం అధ్యక్షులు రాఘవయ్య, జిల్లా అధ్యక్షులు పైడి కాంతారావు, కార్యదర్శి ఆదిశేషయ్య, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, వల్లేటి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రహదారులకు నిధులు



సీతారామపురంలో సిమెంటు రహదారి ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ, అధికారులు

సీతారామపురం, న్యూస్‌టుడే : మండలంలో సిమెంటు రహదారులు త్వరలో నిర్మించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈఈ మణికుమార్ సూచించారు. మంగళవారం వీటిని నిర్మించాల్సిన కాలనీలు, గ్రామాలను పరిశీలించారు. 14 పంచాయతీల్లో రూ. 2.37 కోట్లతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన అనంతరం పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్య, తెదేపా నాయకులు వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

రైలులో నుంచి పడి దుర్మరణం

బిట్రగుంట, న్యూస్‌టుడే : మండలంలోని శ్రీవెంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందిన వైనమిది. దిగువ మార్గం విజయవాడ వైపు వెళ్లే రైలులో నుంచి పడినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద రేణిగుంట నుంచి బళ్లార్షా వెళుతున్న టిక్కెట్ ఉంది. శవపరీక్ష నిమిత్తం కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జూదరుల అరెస్టు

అల్లూరు మండల కేంద్రమైన అల్లూరులోని ఇస్కపల్లి రోడ్డు సమీపంలో మంగళవారం జూదమాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. వారి నుంచి రూ.35 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



అదనులో.. వానలు లేక.. సాగు కుదరక



చుక్కనీరు లేని గుడ్లూరు పెద్ద చెరువు

న్యూస్‌టుడే, గుడ్లూరు

నియోజకవర్గంలోని చెరువుల్లో చుక్కనీరు లేదు. వర్షాలు కురుస్తాయనే ఆశతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులకు వర్షాలు ఆలస్యం అవుతుండటంతో దిక్కుతోచని పరిస్థితి. భారీ వర్షం కురిస్తే సేద్యం పనులు పెట్టొద్దామనుకుంటున్న రైతులు తేలికపాటి జల్లులతో నిట్టూరుస్తున్నారు. డివిజన్‌లోనే గత అయిదు నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవడం గమనార్హం. ప్రధానంగా రాళ్లపాడు కుడికాలువతోపాటు పెద్దచెరువులైన గుడ్లూరు, మాచవరం, మోపాడు, చేవూరు, రావూరు, అమ్మవారిపాలెం, భీమవరం, బద్దిపూడి, లింగసముద్రం, వలేటివారిపాలెంలో ఎక్కువగా వరి సాగు చేస్తుంటారు. కానీ, గతేడాది కుడి కాలువ కింద సుమారు పదిహేను వేల ఎకరాల్లో మెట్ట పంటలు సాగుచేశారు.

ఎండిన తటాకాలు


నియోజకవర్గంలో చెరువులు నిండాలంటే వర్షాలే ఆధారం. గత కొన్నేళ్లుగా వాతావరణంలో మార్పుల వల్ల ఎప్పుడు వర్షం కురుస్తుందో అర్థం కాని పరిస్థితి. బంగాళాఖాతంలో తుపానులు వస్తే తప్ప చెరువులు నిండని పరిస్థితి. ఈ సంవత్సరం తుపానుల జాడ లేక తటాకాలు ఎండిపోతున్నాయి. దీంతో పంట సాగు ఆలస్యమవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కందుకూరు నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

గుడ్లూరు మండలంలోని గుడ్లూరు, పూరేటిపల్లి, రాజుపాలెం, చినలాటరపి, చెమిడిదిపాడు, స్వర్ణాజిపురం, కొత్తపేట చెరువులు ఎండిపోయాయి. ఉలవపాడు మండలంలోని బద్దిపూడి, కరేడు తటాకాల్లో నీటిచుక్క లేదు. లింగసముద్రం మండలంలోని పెదపవని.. వలేటివారిపాలెం మండలంలోని శాఖవరం, పోకూరు కళ్వళ్ల చెరువుల కింద సగం ఆయకట్టు కూడా సాగు చేయలేదు. కందుకూరు మండలంలోని మాచవరం, మోపాడు చెరువుల కింద పూర్తిస్థాయిలో పంటలు సాగు చేయడం లేదు. సగానికిపైగా పొలాల్లో జామాయిల్, సరుగుడు సాగు చేస్తున్నారు.

4నెలలుగా కురిసిన వర్షపాతం వివరాలు (మి.మీ.లో)

నెల	సాధారణం	కురిసింది
జూన్	54.5	41.3
జులై	79	105
ఆగస్టు	89	105
సెప్టెంబరు	123	68



సాగులేని పెద్ద చెరువు ఆయకట్టు మాగాణి

రెండెకరాలు కూడా సాగు చేయలేకపోతున్నా

సత్యనారాయణరాజు, రైతు, గుడ్లూరు

గుడ్లూరు పెద్ద చెరువు కింద రెండు ఎకరాల మాగాణి ఉంది. రెండేళ్ల నుంచి చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో సాగు చేయడం లేదు. ఈ సంవత్సరం ఇంతవరకు చెరువులో చుక్క నీరు లేదు. భారీ వర్షాలు కురిస్తేనే ఇందులోకి వరద నిండుతుంది. లేకపోతే ఈ సంవత్సరం కూడా గతేడాది పరిస్థితే.

మద్యం సీసాల స్వాధీనం

ఉలవపాడు : అలగాయపాలెం రైల్వే గేటు వద్ద అనుమానాస్పదంగా నిలబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న మద్యం సీసాలు దొరికాయనీ, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఉలవపాడు నుంచి తీర ప్రాంత గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గ్రామీణ ఎస్సై రమణయ్య స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆనందపురం సమీపంలో మంగళవారం తనిఖీలు చేస్తుండగా ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయాలు

లింగసముద్రం, న్యూస్‌టుడే: జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ సమీపంలో కుక్కలు అడ్డురావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. చీమలపెంటకు చెందిన హనుమంతురావు ద్విచక్రవాహనంపై లింగసముద్రానికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. అతని తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. అతని పరిస్థితి విషయంగా ఉన్నట్లు సమాచారం.



నేత్రదానం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: ఇందుకూరు పేటకు చెందిన ప్రకాశ్(75) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్ర మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. మనిషి మృతిచెందిన తరువాత కూడా బతికే అవకాశాన్ని కల్పించేందుకు నేత్రదానం చేయాలన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన కంటివైద్య నిపుణులు జి.మహేంద్ర సేకరించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై శిక్షణ

విడవలూరు, న్యూస్‌టుడే: విడవలూరు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, వార్డు సభ్యులకు ఈ నెల 9, 10వ తేదీల్లో రెండు రోజులపాటు పారిశుద్ధ్యం, ఆర్థిక నిర్వహణ, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నగేశ్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల ప్రాంగణంలో మంగళవారం మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. తెదేపా మండలాధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గాన్ని క్యాన్సర్ రహితంగా మార్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య: విడవలూరు నుంచి మన్నాథరావుపేట, జాన్‌పేట, చెలికల మధ్య రోడ్డు అధ్వానంగా ఉంది. రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – గ్రామస్థులు

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తాం. – నగేశ్ కుమారి, ఎంపీడీవో

కాలువలు అధ్వానం.. పారుదలకు ఆటంకం



● వెంకటాచలం మండలంలోని ఈదగాలి సప్లై ఛానల్ కాలువ ఇది. సర్వేపల్లి రిజర్వాయర్ పరిధిలోని అత్యంత ప్రధానమైన కాలువ ద్వారా పది గ్రామాల్లో 20 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. నీరు సక్రమంగా సరఫరా లేక గతంలో సిమెంట్ లైనింగ్ పనులు చేశారు. నామమాత్రంగా చేయడంతో కాలువ పలు చోట్ల పగుళ్లిచ్చి అప్పట్లోనే కూలిపోయింది. తరువాత మరమ్మతులు చేయలేదు. ప్రస్తుతం కాలువ అధ్వానంగా ఉంది.



● సర్వేపల్లి కాలువ నుంచి సర్వేపల్లి రిజర్వాయర్‌కు సాగునీరు సరఫరా చేసే ప్రధాన కాలువకు సిమెంట్ లైనింగ్ పనులు చేసినా నాణ్యత లేమితో చాలా చోట్ల రివిట్‌మెంట్ కూలింది. కొన్ని చోట్ల పది మీటర్ల వరకు లైనింగ్ పగుళ్లిచ్చి అధ్వానంగా ఉంది. కొన్ని చోట్ల మట్టి పేరుకుపోయి కాలువ పూడిపోయింది. సాగునీరు సరఫరాకు ఆటంకం ఏర్పడింది.

న్యూస్‌టుడే, వెంకటాచలం

నీరు వృథా కాకుండా... చివరి ఆయకట్టు వరకు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలన్న లక్ష్యంతో సాగునీటి కాలువలకు గతంలో సిమెంట్ లైనింగ్ చేపట్టారు. బిల్లుల కోసమే పనులన్నట్లు చేయడంతో ప్రస్తుతం కాలువల రివిట్‌మెంట్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. రెండు, మూడు దశాబ్దాల పాటు పటిష్ఠంగా ఉండాల్సిన లైనింగ్ నాసిరకమైన పనులతో కూలిపోతోంది. సాగునీరు సక్రమంగా పారడం లేదు.

సోమశిల జలాశయం నుంచి సర్వేపల్లి కాలువ ద్వారా రిజర్వాయర్‌కు సాగునీరు సరఫరా అవుతుంది. గతంలో ప్రధాన కాలువకు చేసిన సిమెంట లైనింగ్ పనులు చేపట్టిన గుత్తేదారులు నాణ్యత పాటించకపోవటంతో తొలి ఏడాదిలోనే చాలా చోట్ల కాలువ దెబ్బతింది. లైనింగ్ పనులు దెబ్బతిని కాలువలో మట్టి పేరుకుపోయింది. నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. రిజర్వాయర్‌తో పాటు అనుబంధ కాలువల ఆధునికీకరణకు అప్పట్లో రూ.70 కోట్లకు పైగా వెచ్చించినా పనులు నాణ్యతగా చేయకపోవడంతో సాగుదారులకు అవస్థలు తప్పడం లేదు.

చివరి ఆయకట్టుకు నీరందక..

సర్వేపల్లి రిజర్వాయర్ అనుబంధ కాలువలు ప్రస్తుతం అధ్వానంగా ఉన్నాయి. జలాశయం పరిధిలో అత్యంత కీలకమైన ఈదగాలి కాలువ ఎక్కువ చోట్ల దెబ్బతింది. కొన్ని చోట్ల అయిదు నుంచి పది మీటర్ల వరకు లైనింగ్ దెబ్బతింది. లైనింగ్ దెబ్బతిన్న కారణంగా నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. సుమారు 20 కిలో మీటర్లు దూరంలో చివరి ఆయకట్టుకు వెళ్లాల్సి ఉండగా కాలువ దుస్థితి అధ్వానంగా ఉండటంతో సరఫరాకు ఆటంకం కలుగుతుంది.

పరిశీలించి చర్యలు

శ్రీనివాసులు, ఏఈ, నీటిపారుదల శాఖ

నూతనంగా బాధ్యతలు తీసుకున్నా. కాలువల పరిస్థితి పరిశీలిస్తాం. అధ్వానంగా ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం. సాగునీరు సక్రమంగా సరఫరా కావాలన్నదే లక్ష్యం.

మరమ్మతులేవీ..?

కాలువలు దెబ్బతిన్న వెంటనే మరమ్మతులు చేస్తే కొద్దిపాటి నగదుతో పనులు పూర్తి చేయొచ్చు. కాలువల సిమెంట్ లైనింగ్ పనులను అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. ఏడేళ్ల క్రితం దెబ్బతిన్న కాలువలను మరమ్మతులు చేయలేదు. కాలువలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. వదిలివేస్తే కాలువలు రివిట్‌మెంట్ మరింత దెబ్బతింటుందని, అధికారులు, నాయకులు స్పందించి కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమించినా పట్టించుకోరా..



మనుబోలులో మాట్లాడుతున్న ఎంపీడీవో జలజాక్షి

మనుబోలు, న్యూస్‌టుడే : ప్రభుత్వ భూములు ఆక్రమించినా పట్టించుకోరా అని సభ్యులు గళమెత్తారు. మనుబోలు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. పలుశాఖల అధికారులు ఆయా శాఖల జరుగుతున్న ప్రగతి వివరించారు. ఆర్టీసీ బస్సులు మనుబోలు గ్రామంలోకి రావడం లేదని, వ్యవసాయాధికారులు కార్యక్రమాలకు పిలవడం లేదంటూ పలు అంశాలపై ప్రజాప్రతినిధులు అధికారులను ప్రశ్నించారు. నీటిపారుదలశాఖ, విద్యుత్తుశాఖ, మత్స్యశాఖ, ఉద్యానవన శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో జలజాక్షి, ఉపతహసీల్దారు బషీర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక చేజర్ల మండలసభ వాయిదా

చేజర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణకు సరిపడా కోరం లేకపోవడంతో వాయిదా పడింది. అధికారులకు వీసీ ఉండటంతో నిర్ణీత సమయానికి సభ ప్రారంభించలేదు. సమావేశానికి వచ్చిన ఆరుగురు సభ్యుల్లో ముగ్గురు సభ ప్రారంభించకముందే వెళ్లిపోయారు. ఈ క్రమంలో సమావేశాన్ని వాయిదా వేయాలని తెదేపా సర్పంచులు కోరడంతో ఎంపీడీవో విజయలలిత సభను వాయిదా వేశారు. సభకు వచ్చి సంతకాలు చేసిన వారిని పరిగణనలోనికి తీసుకొని.. కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి కోరటంతో తెదేపా, వైకాపా సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది.

విష పురుగులతో భయాందోళన



మండలంలోని కంబిపల్లి పంచాయతీ గంగిరెడ్డుల కాలనీ వద్ద గొలగమూడికి వెళ్లే మార్గంలో రహదారి పక్కన ఉన్న ప్రయాణికుల వసతిగృహం చుట్టూ ముళ్లచెట్లు పెరిగాయి. తరచూ విషపురుగులు వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అందులోకి వెళ్లాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి చెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ పంచాయతీ అధికారులను పంపి, చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

దోమల బెడదతో సతమతం



మండలంలోని అనికేపల్లి పంచాయతీ కాశీనగరం వద్ద రహదారి పక్కనే తాగునీటి ట్యాంకు కింద మురుగు నీరు ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పాటు దోమలు వస్తున్నాయని, సమీప ఇళ్లలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకు వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఎంపీడీవో కల్పన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శిని పంపి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, వెంకటాచలం

బస్ షెల్టరు బాగుచేయరూ



విడవలూరు మండలం రామతీర్థంలో ప్రధాన కాలువ కట్ట ఉన్న బస్సుషెల్టరు అధ్వానంగా ఉంది. దీని చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేయడంతో మూసుకుపోయి కనిపించడం లేదు. అందులో గడ్డి, దిమ్మెలు ధ్వంసమై ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వేచి ఉండే బాటులో తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో నగేశ్‌కుమారి మాట్లాడుతూ.. పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, విడవలూరు, తోటపల్లిగూడూరు

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

పొదలకూరు, న్యూస్‌టుడే : అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శ్రీహరి కోట షార్ కేంద్రం వారు గత నెలలో నిర్వహించిన స్పేస్ క్విజ్ పోటీల్లో పొదలకూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయులు సనత్‌కుమార్ తెలిపారు. మంగళవారం నెల్లూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శాస్త్రవేత్తల చేతుల మీదుగా ప్రముఖుల చేతులమీదుగా బహుమతులు అందుకున్నారని చెప్పారు. ఎనిమిదో తరగతి విద్యార్థి వెంకటేశ్వర్లు, తొమ్మిదో తరగతి విద్యార్థి సంతోష్ ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. కార్యక్రమంలో శ్రీహరికోట షార్ కేంద్రం డిప్యూటీ డైరెక్టరు శ్రీకాంత్, మేనేజరు శేషారెడ్డి, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత సాగు.. బాగు

చేజర్ల, న్యూస్‌టుడే: భావితరాల ఆహార అవసరాలకు భూమి పనికొచ్చేలా నేటితరం పర్యావరణ హిత సాగు చేయాలని ఆత్మ పీడీ శివనారాయణ సూచించారు. అధిక ఎరువులు, క్రిమి సంహారకాల వాడకాన్ని తగ్గించేందుకు రైతులందరూ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మంగళవారం చిత్తలూరులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వివరించారు. ఏవో వి.శశిధర్, ఇఫ్కో సంస్థ ప్రతినిధి లక్ష్మీనారాయణ, ఏఈవో వెంకటేశ్వర్లు, వీపీఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

అనంతసాగరం: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి.. రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి సూచించారు. మంగళవారం గౌరవరం, ఆమనిచిరువెళ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆత్మకూరు మండలం మహిమలూరు, ఆరవీడులో ఆమె పరిశీలించారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలం కసుమూరు రోడ్డు వద్ద జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందడంతో మంగళవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించి మృతుడి వద్ద ఉన్న చరవాణి నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడు తిరుపతి జిల్లా తిరుచానూరుకు చెందిన ఆవుల చంద్ర (60)గా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి మృతుడిని ఇక్కడ వదిలి వెళ్లినట్లు సమాచారం. అనారోగ్యం కారణంగా ఉదయం మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు.

● మంగళవారం ఉదయం మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు రాత్రి వరకు అక్కడి నుంచి తరలించ లేదు. పోలీసుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి ఏడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

రాపూరు, న్యూస్‌టుడే: మద్దెల మడుగు కూడలిలోని తెలుగుగంగ కాలనీ సమీపంలో రైల్వే విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసులు ఇంట్లో సుమారు 176 గ్రాముల బంగారంతో, రూ.20 వేల నగదును దొంగలు చోరీ చేశారని ఎస్సై రాజేశ్ తెలిపారు. మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

అనంతసాగరం, సంగం, వెంకటాచలం, న్యూస్‌టుడే: రేవూరులో మట్టి అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టరును రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకొని మంగళవారం పోలీసుస్టేషన్‌కు తరలించారు. రేవూరులో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వగా రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల సిఫారసు మేరకు తహసీల్దారు ఒక ట్రాక్టరును వదిలేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి లేని మరో ట్రాక్టరును అనంతసాగరం పోలీసులకు అప్పగించారు. ● సంగం మండలం వెంగారెడ్డిపాళెం సమీపంలోని పెన్నానది నుంచి ఇసుకను బుచ్చికి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరుని మంగళవారం వేకువజామున సంగం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గ్రామస్థుల సమాచారంతో దువ్వూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద మాటు వేసి దాన్ని స్వాధీనం చేసుకుని బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడుకు చెందినదిగా గుర్తించారు. ●వెంకటాచలం మండలంలోని టోల్‌ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్ చేశారు. సీఐ సుబ్బారావు సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా...నాయుడుపేట నుంచి నెల్లూరుకు ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లను ఆపి పరిశీలించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగజ్జననీ పాహిమాం

బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, పొదలకూరు, మనుబోలు, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, సైదాపురం, రాపూరు, కలువాయి, ఆత్మకూరు, సంగం, అనంతసాగరం, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని మంగళవారం కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ఆలయాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో వైభవంగా జరుగుతున్నాయి. జొన్నవాడ మల్లికార్జున స్వామి కామాక్షితాయి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరు మండలం పెంచలకోనలో ఆదిలక్ష్మి అమ్మవారిని సంతానలక్ష్మి అలంకారంలో అలంకరించారు. బంగారమ్మతల్లిగా, అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో, మనుబోలులోని కోదండరామపురం దసరా చావిడి వద్ద పోలేరమ్మ అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. సైదాపురంలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో మంగళవారం గాయత్రి దేవి అలంకారంలో, మహాలక్ష్మి దేవి అలంకారంలో అమ్మ దర్శనమిచ్చారు. కలువాయిలోని బిడ రామాలయంలో శ్రీ హనుమంతునిసేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆత్మకూరులోని కస్తూరమ్మ ఆలయంలో అమ్మవారికి గాయత్రీదేవిగా అలంకరించారు. దుర్గామల్లేశ్వర ఆలయంలో కనక దుర్గాదేవి.. గజలక్ష్మి, సంగమేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో కామాక్షిదేవి అభయమిచ్చారు. సోమశిలలోని సోమేశ్వరాలయంలో కామాక్షి అమ్మవారు భక్తులకు శ్రీ మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు.





కోనలో సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు.. హాజరైన భక్తులు



జొన్నవాడలో..



పొదలకూరులో..



మనుబోలులో..



ఆత్మకూరులో..



సంగం: అన్నపూర్ణాదేవిగా కామాక్షిదేవి

చెరువు కట్టలు బాగు చేయండి

మనుబోలు, బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, న్యూస్‌టుడే: ఉపాధి పనుల ద్వారా చెరువుకట్ట పనులు గ్రు చేయాలని కొమ్మలపూడి తెదేపా నాయకులు ఎంపీడీవో జలజాక్షిని కోరారు. స్థానిక మండల పరిషత్తును కార్యాలయంలో ఎంపీడీవోను మంగళవారం తెదేపా మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీవో శ్రీహరి, కొడవలూరు ఎంపీడీవోగా సుబ్బారావులను తెదేపా మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

దర్గాలో ఆర్డీవో ప్రార్థనలు

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజా నాయబ్‌రసూల్ దర్గాను మంగళవారం ఆత్మకూరు ఆర్డీవో బి.పావని సందర్శించారు. దర్గాకు వచ్చిన ఆమెకు దర్గా ఈవో-2 షరీఫ్ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. దర్గాలోని హజరత్ నాయబ్ రసూల్, బీబీ హబీబాఖాతూన్ అమ్మవారి సమాధులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రసన్న పూజలు

కోవూరు, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రామదేవత నాగావరపమ్మ అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి భక్తులతో కలిసి అమ్మవార్లను దర్శించుకుని అమ్మవార్లకు చీర పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

వెంకటాచలం, న్యూస్‌టుడే: మండలంలోని చవటపాళెంకు చెందిన యువతి రెండు రోజులుగా కనిపించడంలేదు. పలుచోట్ల విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు మంగళవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

జూద స్థావరంపై దాడులు

పొదలకూరు, న్యూస్‌టుడే : పొదలకూరు మండలం అమ్మవారిపాళెం అటవీ ప్రాంతంలో మంగళవారం రాత్రి కోడి పందెం స్థావరంపై ఎస్సై హనీఫ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7000 నగదు, తొమ్మిది సెల్ ఫోన్లు, నాలుగు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గాంధీ ఆశ్రమ అభివృద్ధికి ప్రతిపాదనలు



ఆశ్రమ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(సాంస్కృతికం), బుచ్చి, న్యూస్‌టుడే: పల్లెపాడులోని గాంధీ ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఆశ్రమ కమిటీ ప్రతినిధులు మంగళవారం పర్యాటక శాఖ అధికారులకు సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు పర్యాటకశాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, వంశీకృష్ణ, శ్రీనివాసరావు ఆశ్రమ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆశ్రమ ప్రహరీ, అప్రోచ్‌రోడ్డు, పెన్నానదివైపు రక్షణ గోడ నిర్మాణం, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు, అతిథి భవనాల మరమ్మతులు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, జిమ్, వృద్ధాశ్రమ పనులు పూర్తిచేయించాల్సిన అవసరాన్ని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఇందుకోసం ముందస్తుగా సోమవారం పర్యాటక శాఖ అధికారులు పల్లెపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని సందర్శించారు. సమావేశంలో గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు రవీంద్రారెడ్డి, రాజేశ్వరమ్మ, రామిరెడ్డి, ఐఆర్‌సీఎస్ ప్రధాన కార్యదర్శి మస్తానయ్య పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



కనుపర్తిలో సాగుదారులకు సూచన చేస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, కొడవలూరు, విడవలూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో అనువైన మధ్య, స్వల్పకాలిక రకాల వరిని ఎంపిక చేసుకోవాలని ఏవో వాసు అన్నారు. మంగళవారం పొదలకూరు మండలం కనుపర్తి, చెన్నారెడ్డిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ విత్తశుద్ధి, పచ్చిరొట్ట ఎరువులు రాయితీపై ఉపయోగించుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యానికి పరికరాలు రాయితీపై పొందవచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి, ఏవో మధురిమ, పొదలకూరు ఉద్యాన అధికారి ఆనంద్, పట్టుపరిశ్రమ అధికారి మస్తానయ్య, వీహెచ్ఏలు రత్నమ్మ, పాల్గొన్నారు. కొడవలూరు మండలంలోని నాయుడుపాళెం, గండవరంలో ఏవో లక్ష్మి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. బుచ్చి మండలంలోని నాగమాంబాపురం, ఇస్కపాళెం గ్రామాల్లో పొట్టయ్య పాల్గొని కోళ్ల వ్యర్థాలు చేపలకు మేతగా వేయడంతో వచ్చే నష్టాలపై వివరించారు. విడవలూరు మండలం చౌకచర్ల, దంపూరు గ్రామాల్లో ఏవో వెంకటకృష్ణయ్య రైతులకు పలు సూచనలు చేశారు. తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరు, ఇస్కపాలెంలో ఏడీఏ రాజ్‌కుమార్ రైతులతో మాట్లాడారు.

వైకాపా పాలనలో నిబంధనలకు తిలోదకాలు..!

జనావాసాల్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు తొలగించాలని స్థానికుల నివేదన

న్యూస్‌టుడే, కోవూరు

వైకాపా పాలనలో మద్యం దందా జోరుగా సాగింది.. కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలతో పాటు రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల్లో గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయించి నాయకులు సొమ్ముచేసుకున్నారు. పాఠశాలలు, దేవాలయం, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేయొద్దని నిబంధనలు చెబుతున్నా బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా ప్రభుత్వమే దుకాణాలు ఏర్పాటు చేసింది. నాసిరకమైన మద్యం విక్రయించి పేదల ప్రాణాలు తీసింది. తాజాగా కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. ముఖ్యంగా జనావాసాల్లో లేకుండా దూరంగా ఉండేలా చూడాలని మహిళలు అధికారులకు విన్నవిస్తున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణాల్లో ప్రత్యేక గదులు ఏర్పాటు చేస్తే వివాదాలు తగ్గుతాయని మహిళలు చెబుతున్నారు. కోవూరు సర్కిల్ పరిధిలో మంగళవారం నాటికి మొత్తం 21 మద్యం దుకాణాలకు 89 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

● పొదలకూరు రాంనగర్ గేట్ సెంటరు వద్ద జనావాసాలతో రద్దీగా ఉంటుంది.. సమీపంలో పాఠశాలలు, దేవాలయం, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వైకాపా పాలనలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడే కొందరు తాగి వీరంగం చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రివేళల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఉద్యోగాలు, కళాశాలలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి గేటు సెంటరులో బస్సు దిగి రావాలంటే నరకయాతన పడ్డారు. పలుమార్లు నిరసనలు, ఆందోళన చేయడంతో మద్యం దుకాణం తొలగించి కలువాయి మార్గంలో ఏర్పాటు చేశారు. తాజాగా ప్రస్తుతం మద్యం దుకాణం ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులకు తెలియడంతో ఆందోళన చేపట్టారు. కలెక్టర్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు వినపత్రమిచ్చారు.



● కోవూరు నియోజకవర్గ కేంద్రంలోని బజారు కూడలిలో మద్యం దుకాణం కొనసాగుతోంది.. సమీపంలో వివిధ పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, బస్సుస్టేషన్ ఉంది. వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎక్కువ మంది మహిళలు, యువతులు, వృద్ధులు బస్టాండు వద్దకు వస్తున్నారు. ఎక్కువ మంది మద్యం తాగి వస్తుండటంతో మహిళలు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పట్టణంలో ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.. పలువురు తాగి తరచూ వివాదాలకు దిగుతున్నారు. ఇరుకు రోడ్డు రావడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది.

ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయొచ్చు

కిశోర్, ఎక్సైజ్ సీఐ, కోవూరు

మద్యం దుకాణాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేస్తాం. బడి, గుడి, జాతీయ రహదారులకు వంద మీటర్ల దూరంలో ఉండేలా చూస్తాం. ప్రజలకు అసౌర్యకరంగా ఉంటే తమకు తెలిపితే తక్షణమే చర్యలు తీసుకుంటాం. ప్రజలు స్వయంగా ఫిర్యాదు చేయొచ్చు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు వద్దు: గఫూర్



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: వక్ఫ్ చట్ట సవరణకు రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం మద్దతు ఉపసంహరించుకోవాలని మాజీ శాసనసభ్యులు, ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఏ గఫూర్ పేర్కొన్నారు. ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వక్ఫ్ చట్ట సవరణలు వాటి పరిణామాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో భాజపా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎం సుభహాన్, అధ్యక్షుడు సయ్యద్ రఫీ, చాంద్‌బాషా, నగర అధ్యక్షుడు ఫయాజ్, షేక్ రియాజ్, అమానుల్లా పాల్గొన్నారు.

కార్యాలయంలోనే విద్యుత్తు వృథా

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: విద్యుత్తును వృథా చేయరాదు.. దీపాలు, వీధిలైట్లు పగటి పూట వెలగకుండా చూడాల్సిన బాధ్యత వినియోగదారులపై ఉందని ఇటీవల విద్యుత్తు శాఖ జిల్లా సూపరింటెండెంట్ విలేకరుల సమావేశంలో తెలిపారు. నగర కేంద్రంలో ఉన్న విద్యుత్తు భవన్‌లోనే వృథా చేస్తున్నారు. మంగళవారం ఎస్ఈ వి.విజయన్ ఛాంబర్ ఆనుకుని ఉన్న టెక్నికల్ ఈఈ కార్యాలయంలో, ఆయన ఛాంబర్‌కు ఆనుకుని ఉన్న మరో రెండు గదుల్లో సిబ్బంది, అధికారులు లేనప్పటికీ అన్నీ ఫ్యాన్లు తిరుగుతూ, లైట్లు వెలుగుతూ కనిపించాయి.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: వేదాయపాళెం గాంధీనగర్‌లో కాలువలు పూడికతో నిండిపోయి... మురుగునీరు ముందుకు కదలడం లేదు. – షమీమ్

? జేమ్స్‌గార్డెన్‌లోని సచివాలయం వీధిలో కాలువల్లో నీరు పోవడం లేదు. వ్యర్థాలతో నిండిపోయింది. – గణపతి

సమాధానం: కాలువలో వ్యర్థాలను తొలగించడంతోపాటు పూడిక తీయిస్తాం.

– డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)


జగన్‌తో రాష్ట్రానికి అన్యాయం: భాజపా

నెల్లూరు (బృందావనం), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ నవరత్నాల పేరుతో నకిలీ రత్నాలను ప్రజలకు అందించి రాష్ట్రాన్ని అంధకారంలో ఉంచారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని భాజపా జిల్లా కార్యాలయంలో మీడియా సమాశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలకు తన పేరుతో మార్పు చేసుకుంటూ స్టిక్కర్ సీఎంగా పేరు తెచ్చుకున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేశ్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్, ఓబీసీ జోనల్ ఇన్‌ఛార్జి ముక్కు రాధాకృష్ణ, నాయకులు గిరికుమార్ గౌడ్, రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, నారాయణ, రత్నం నాయుడు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు.. అనధికార భవనాలే అడ్డా

నెల్లూరు నగరంలో అనధికారిక భవనాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిర్మాణానికి అనుమతి తీసుకునే క్రమంలో ప్లాన్ చూపి అందుకు విరుద్ధంగా పనులు చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మిన్నకుండి పోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏకంగా 14 మంది పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై చర్యలకు ఉపక్రమించడం సంచలనంగా మారింది.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)



పది అడుగులు కూడా లేని వీధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భారీ భవనం

నగరంలో 54 డివిజన్లు ఉండగా.. సుమారు 9 లక్షల జనాభా ఉంది. ప్రతినెలా నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగానికి సుమారు 50 వరకు భవన నిర్మాణాలకు దరఖాస్తులు వస్తుంటాయి. ఏటా రూ.40 కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. అనధికారిక నిర్మాణాలతో నగరపాలక ఆదాయానికి గండి పడుతోంది. కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి.

అయినా చర్యలు తీసుకోరు

నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో పాటు 166 సచివాలయాల పరిధిలో ప్లానింగ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఉన్నారు. ఆయా వార్డుల్లో ఎక్కడ నిర్మాణం జరిగినా ఇట్టే తెలిసిపోతుంది. అయినా అనధికారిక నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదు. కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులు తమ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరిగినా పట్టించుకోవడం లేదు. ఒకటికి రెండు సార్లు తాఖీదులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు నిబంధనలు పక్కన పెట్టి అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. ప్రస్తుతం ఇవన్నీ కీలదశలో ఉన్నాయి.

వివరాలు సేకరిస్తున్నాం

కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ నిబంధనలు పాటించని కట్టడాలను నిర్మాణ స్థాయిలోనే ఆపేయాలని ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్న భవనాల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

రూ.లక్షల వసూలు

గత అయిదేళ్లలో అప్పటి ప్రభుత్వ అండదండలతో అనుమతులు ఇచ్చేశారు. దీంతో ప్రధాన ప్రాంతాల్లో ఇష్టానుసారంగా భవనాల నిర్మాణం జరిగాయి. మాగుంట లేఅవుట్, మినీ బైపాస్ రోడ్డు, ట్రంకురోడ్డు, పొగతోట, రాయాజీవీధి, ములుమూడి బస్టాండు, మనుమసిద్ధినగర్, పొదలకూరు రోడ్డు, బీవీనగర్ తదితర ప్రాంతాల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో అనధికార, నిబంధనలు పాటించని నిర్మాణాలకు లక్షల రూపాయలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టణ ప్రణాళిక అధికారులు కొందరు సచివాలయంలో పనిచేసే ప్లానింగ్ సెక్రటరీల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

పురపాలక సేవలపై అధ్యయనం



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: దేశంలోని ఇతర రాష్ట్రాల్లో సమర్థంగా నిర్వహిస్తున్న పురపాలక సేవలను అధ్యయనం చేసి రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిషనర్ల బృందంలో నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ ఉన్నారు. 'బెస్ట్ ప్రాక్టీసెస్ అదర్ స్టేట్స్' కార్యక్రమంలో భాగంగా అధ్యయన బృంద సభ్యునిగా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని ఆదర్శ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను సందర్శిస్తున్నారు. ఆయా నగర, పట్టణాల్లో తాగునీటి సరఫరా, వ్యర్థాల సేకరణ, రోడ్లు, డ్రైను కాలువలు, భూగర్భ డ్రైనేజీ, మరుగుదొడ్లు, ప్లాన్ల మంజూరు, ఇతర మౌలిక సదుపాయాల నిర్వహణతో పాటు పన్నుల వసూళ్ల విధానాలను అయిదు రోజుల పాటు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

డబ్బులు డిమాండ్ తగదు

నెల్లూరు(నగరపాలకసంస్థ): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దోచుకునేందుకే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచినట్లు ఉన్నారని వైకాపా ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి అడపాల ఏడుకొండలు తెలిపారు. మంగళవారం నెల్లూరు నగరంలోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన సూరాయపాళెం ఇసుక రీచ్‌లో రూ.కోట్లు దోచుకునేందుకు స్కెచ్ వేసిన మాట వాస్తవమని ఆరోపించారు. నిరుపేద దళితులకు ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేయడం దుర్మార్గం అన్నారు.

లక్ష్యాలు సాధించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని రామచంద్రాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి ఎస్‌కె.ఖాదర్‌వలి మంగళవారం సందర్శించారు. ఏఎన్ఎం, ఆశాలతో సమావేశం నిర్వహించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు.

ఈఈకి అభినందనలు



శ్రీధర్‌ను అభినందిస్తున్న జిల్లా విద్యుత్తు ఉద్యోగులు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : జిల్లాలో విద్యుత్తు శాఖలో ఈఈగా పనిచేసి బదిలీపై తిరుపతి కార్పొరేట్ ఆఫీసులో ఐటీ విభాగ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన తనమాల శ్రీధర్‌ను మంగళవారం జిల్లా విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ ఈఈ జగదీష్, శ్రీధర్, జనార్దన్, డీఈఈ అశోక్, సీనియర్ అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై ప్రయాణమెలా!



వేదాయపాళెం వెంకటరెడ్డినగర్ శివాలయం వద్ద కాలువ పొంగి పొర్లి మురుగునీరంతా రోడ్డుపై చేరుతోంది. గుంతలు పడి అందులో మురుగు చేరడంతో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. శివాలయానికి వెళ్లే భక్తులు ముక్కు మూసుకుని పోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీరు రోడ్డుపై చేరకుండా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

సేద తీరేందుకు చోటేది?

పొదలకూరు రోడ్డు ఇండియన్ ఆయిల్‌పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న బస్సు షెల్టర్ ముందు ట్రాక్టర్లు, లారీలు, ప్రైవేటు బస్సులు పార్కింగ్ చేస్తున్నారు. నగరంలోకి వచ్చే ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిలుచుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వాహనాలను తొలగించాలని నగరవాసులు కోరుతున్నారు. బస్సు షెల్టర్ ఎదుట పెట్టిన వాహనాలను తొలగిస్తామని నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)



పోలీసులూ.. మీరైనా చొరవ చూపండి



పొదలకూరు రోడ్డు పోలీసు కాలనీలో ఖాళీ స్థలాలు అధ్వానంగా తయారయ్యాయి. పిచ్చి మొక్కలు మొలిచి అడవిని తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో గుబురు చెట్లలో పాములు తిరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో చెట్లు తొలగించాలని కోరుతున్నారు. నగరపాలక అధికారులు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (కలెక్టరేట్): జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఛాంబరులో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలు, దుకాణాల్లో పని చేసే బాల కార్మికులను గుర్తించాలని సూచించారు. ప్రతినెలా తనిఖీలు నిర్వహించి యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, సాంఘిక సంక్షేమశాఖాధికారి శ్రీనివాసరావు, డీఈవో పి.రామారావు, కార్మికశాఖ ఉప కమిషనర్ వెంకటేశ్వరరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ డీసీపీవోలు సమత, సుమతి పాల్గొన్నారు.

అమ్మ పరమేశ్వరి.. అఖిలాండేశ్వరి

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవార్లు విశేష అలంకరణల్లో దర్శనమిచ్చారు. భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాజరాజేశ్వరిఅమ్మవారి ఆలయంలో నక్షత్ర హారతులిచ్చారు. పలు ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– ఈనాడు, నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)



రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నృత్య ప్రదర్శన



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో చండీ అలంకరణ



లలితాదేవిగా బాలాజీనగర్ సీతాదేవి



విజయలక్ష్మిగా నరసింహకొండ ఆదిలక్ష్మి



చండి అలంకరణలో భువనేశ్వరి



మహాలక్ష్మిగా విరాట్‌నగర్ గాయత్రి



వేదాయపాళెం శ్రీకృష్ణ మందిరంలో గజలక్ష్మిగా



ఫత్తేఖాన్‌పేట అరిగలవారి వీధిలో విజయలక్ష్మిగా..

గాంధీ ఆశ్రమ అభివృద్ధికి ప్రతిపాదనలు



ఆశ్రమ కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న పర్యాటకశాఖ అధికారులు

నెల్లూరు(సాంస్కృతికం): పల్లెపాడులోని గాంధీ ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఆశ్రమ కమిటీ ప్రతినిధులు మంగళవారం పర్యాటక శాఖ అధికారులకు సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు పర్యాటకశాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, వంశీకృష్ణ, శ్రీనివాసరావు ఆశ్రమ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆశ్రమ ప్రహరీ, అప్రోచ్‌రోడ్డు, పెన్నానదివైపు రక్షణ గోడ నిర్మాణం, డిజిటల్ గ్రంథాలయం ఏర్పాటు, అతిథి భవనాల మరమ్మతులు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, జిమ్, వృద్ధాశ్రమ పనులు పూర్తిచేయించాల్సిన అవసరాన్ని కమిటీ సభ్యులు తెలియజేశారు. సమావేశంలో గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు రవీంద్రారెడ్డి, రాజేశ్వరమ్మ, రామిరెడ్డి, ఐఆర్‌సీఎస్ ప్రధాన కార్యదర్శి మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘ నాయకులతో సమావేశం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : బీసీ సంఘ నాయకులతో సమావేశం బుధవారం నగరంలోని ఆర్టీసీ సమీపంలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి కె.ప్రసూన ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జిల్లాలోని బీసీ సంఘ నాయకులు పాల్గొనాలని తెలిపారు. బీసీ కుల గణన, అభివృద్ధి తదితర అంశాలపై సూచనలు, సలహాలు కోరనున్నట్లు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

నెల్లూరు (నేర విభాగం): ఇసుక అక్రమ రవాణాపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు గ్రామీణ మండలం పొట్టేపాలెంకు చెందిన రాజేంద్ర, రాజేష్ అన్నదమ్ములు. వీరు మంగళవారం తమ ట్రాక్టరులో తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్ ప్రాంతంలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తుండగా అయ్యప్పగుడి వద్ద వేదాయపాలెం పోలీసులు ట్రాక్టరును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నెల్లూరు IV అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 325/2024
O.S.No. 233/2024

గుర్రం జయమణి ... పిటీషనరు / వాది
Vs
1. చిరమన రాజీవ్
2. గుర్రం ప్రగతి
3. గుర్రం పల్లవి ... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

నోటీసు

1. చిరమన రాజీవ్ S/o సుధాకర్, డోర్ నెం. 26-3-1048, టీచర్స్ లేఅవుట్, సంఘమిత్ర విద్యాలయం వద్ద, B.V.నగర్, నెల్లూరు సిటీ.
2. గుర్రం ప్రగతి D/o లేట్ గుర్రం ప్రసాదరావు
3. గుర్రం పల్లవి D/o లేట్ గుర్రం ప్రసాదరావు, D.No. 16-11-743, మొదటి వీధి, నారాయణ జూనియర్ కాలేజి వద్ద, హరనాథపురం, నెల్లూరు సిటీ అనువార్లకు పై నెంబర్లు పిటీషనరు / వాది దాఖలు చేసిన పై కేసులో కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం తే. 13–11–2024దికి వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా కానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరుపడి మీ ఆక్షేపణలు సహేతుకముగా దాఖలు చేసుకోవలెను. అట్లు తప్పిన యెడల కోర్టు వారు పై కేసును ఎక్స్‌పార్టీగా మీ పరోక్షమున తీర్మానించెదరు. గాన తెల్పడమైనది.

S.P.S.విజయసారథి, B.Com., B.L.,
J.V.B. గీతేష్, MBA, B.L.,
R. రాజారెడ్డి, B.Com., B.L.,
పిటీషనర్ / వాది తరఫు అడ్వకేట్స్, నెల్లూరు సిటీ. Cell: 91605 32235

నెల్లూరు IV అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 233/2024

గుర్రం జయమణి ... వాది
Vs
1. చిరమన రాజీవ్
2. గుర్రం ప్రగతి
3. గుర్రం పల్లవి ... ప్రతివాదులు

నోటీసు

To : 1. చిరమన రాజీవ్ S/o సుధాకర్, డోర్ నెం. 26-3-1048, టీచర్స్ లేఅవుట్, సంఘమిత్ర విద్యాలయం వద్ద, B.V.నగర్, నెల్లూరు సిటీ.
2. గుర్రం ప్రగతి D/o లేట్ గుర్రం ప్రసాదరావు
3. గుర్రం పల్లవి D/o లేట్ గుర్రం ప్రసాదరావు, D.No. 16-11-743, మొదటి వీధి, నారాయణ జూనియర్ కాలేజి వద్ద, హరనాథపురం, నెల్లూరు సిటీ. అనువార్లకు పై నెంబర్లు వాది దాఖలు చేసిన పై దావాలో కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం తే. 13–11–2024దికి వాయిదా వేసినారు. కావున ఆ రోజు ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా కానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరుపడి మీ ఆక్షేపణలు సహేతుకముగా దాఖలు చేసుకోవలెను. అట్లు తప్పిన యెడల కోర్టు వారు పై కేసును ఎక్స్‌పార్టీగా మీ పరోక్షమున తీర్మానించెదరు. గాన తెల్పడమైనది.

S.P.S.విజయసారథి, B.Com., B.L.,
J.V.B. గీతేష్, MBA, B.L.,
R. రాజారెడ్డి, B.Com., B.L.,
వాది తరఫు అడ్వకేట్స్, నెల్లూరు సిటీ. Cell: 91605 32235

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ

నెల్లూరు(నేర విభాగం): నేర నియంత్రణ ప్రజల సహకారంతో సాధ్యమని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్ బాషా అన్నారు. మంగళవారం భగత్‌సింగ్ కాలనీలో నేర నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, వివిధ చట్టాలు తదితరాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(నేర విభాగం): వివాహిత అదృశ్యంపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. వారి కథనం మేరకు.. సంతపేటకు చెందిన శరత్ బాబుకు విజయవాడలో అఖిల మాధురితో పరిచయమైంది. అది కాస్తా ప్రేమకు దారి తీసింది. ఇద్దరు ప్రేమ వివాహం చేసుకున్నారు. అనంతరం సంతపేటలో కాపురం ఉంటున్నారు. ఈ నెల 5న ఆయన విజయవాడకు వెళ్లారు. మీ తల్లిదండ్రులు అంటే ఇష్టం లేదని, అందుకే వెళ్లిపోతున్నానని భర్తకు లేఖ రాసి అఖిల మాధురి ఇంటి నుంచి వెళ్లిపోయారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోగొట్టుకున్న నగ అందజేత

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో పోగొట్టుకున్న నగను మంగళవారం చిన్నబజారు పోలీసులు బాధితురాలికి అందించారు. పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం శీలానగర్‌లో ఉష, నారాయణ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉష తన పిల్లలతో కలిసి రెండు రోజులు క్రితం మూలాపేటలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. ఈ నెల 7వతేదీ ఆమె ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి వచ్చి వెళ్లే క్రమంలో మెడలోని బంగారు నగ పడిపోయింది. వెతికినా కనిపించకపోవడంతో చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వర రావు పర్యవేక్షణలో క్రైమ్ పార్టీ సిబ్బంది సాంకేతికత ఆధారంగా నగ గుర్తించారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ తన కార్యాలయంలో ఉషకు అందజేశారు. పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అత్తింటి వారి వేధింపులపై ఫిర్యాదు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారి వేధింపులపై బాధితురాలు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రామకోటయ్య నగర్‌కు చెందిన షేక్ సుమయ్యకు వెంగళరావు నగర్‌కు చెందిన నూరుతో పది నెలల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఆమె కుటుంబ సభ్యులు కట్న కానుకల కింద రూ.20వేల నగదు, అయిదు సవర్ల బంగారు ఆభరణాలు, గృహోపకరణాలు ఇచ్చారు. కొద్ది రోజులు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటి వారు ఆమెను అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టారు. ఆమె పుట్టింటికి వెళ్లిపోయారు. కొద్ది రోజులు అనంతరం ఆమె భర్త వద్దకు వెళ్లిపోయారు. భర్త, అత్తమామల్లో మార్పు రాకపోవడంతో బాధితురాలు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎత్తుకు పైఎత్తు

చదరంగంలో అంతర్జాతీయ స్థాయి రేటింగ్

న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)


ఎత్తుకు పైఎత్తు వేయడంలో వారు దిట్ట.. ప్రత్యర్థి ఏ వైపు నుంచి వచ్చినా 'రాజా'ను కాపాడుకోవడంలో వీరి కంటే ఎవరూ అడ్డుకట్ట వేయలేరు. చదరంగంలో పాల్గొన్న ప్రతి పోటీల్లో ర్యాంకులు సాధిస్తున్నారు.. అంతర్జాతీయ స్థాయి ఫిడే ర్యాంకింగ్‌లోనూ స్థానం దక్కించుకున్నారు. స్ఫూర్తిగా నిలిచిన చిన్నారులే.. నెల్లూరుకు చెందిన బండి కీర్తన, సుశ్వంత్.

పోటీల్లో తనదైన ముద్ర



నెల్లూరు నగరానికి చెందిన సెల్వి, కిరణ్‌కుమార్ దంపతుల కుమార్తె బండి **కీర్తన.** స్థానికంగా అయిదో తరగతి చదువుతోంది. చిన్ననాటి నుంచి చదరంగం అంటే ఇష్టం. కుమార్తె అభిరుచికి తగ్గట్టు తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. ఒకవైపు చదువుకుంటూ మరోవైపు చెస్‌లో రాణిస్తోంది. రేపిడ్ రేటింగ్ 1420 ర్యాంకు సాధించడం తక్కువేమి కాదు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో కీర్తన తనదైన ముద్ర వేసుకుంది. ఈ ఏడాది విజయవాడలో జరిగిన ఏపీ స్టేట్ సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ అండర్-11 విభాగంలో మూడో స్థానం, భీమవరంలో జరిగిన ఏపీ స్టేట్ అండర్-11 బాలికల చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నాలుగో స్థానం, చెన్నైలో జరిగిన రాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంటు పోటీల్లో అండర్-11 బాలికల విభాగంలో ఆరోస్థానం సాధించింది. ఇటీవల నెల్లూరులో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీల్లో ఓపెన్ కేటగిరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నగదు బహుమతి అందుకుంది.

అత్యుత్తమ ప్రతిభ



నెల్లూరు నగరానికి చెందిన సురేష్, రోహిణి దంపతుల కుమారుడు **వి.సుశ్వంత్.** స్థానికంగా ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచే చదరంగంలో పట్టు పెంచుకున్నాడు. అంతర్జాతీయ స్థాయి రేటింగ్ 1428 సాధించాడు. ఈ ఏడాది ఆలిండియా ఓపెన్ చదరంగం పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 13వ స్థానం దక్కించుకున్నాడు. చెన్నైలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంటు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రేటింగ్ పాయింట్లు పెంపొందించుకున్నాడు. భీమవరం, రాజస్థాన్, చెన్నైలో జరిగిన ఫిడే రేటింగ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాపిడ్, క్లాసిక్ రేటింగ్ సాధించాడు.

అంత్యక్రియలు



ఆప్యాయతానురాగాలకు మారుపేరైన మా తల్లిగారు
ఎస్.లక్ష్మీరంగనాథం గారు
8-10-24వ తేదీ స్వర్గస్తులైనారు.
ఆ అమృతమూర్తి పవిత్ర ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ..
శోకతప్త హృదయాలతో...

కీ॥ శే॥ సాలవాకం లక్ష్మి గారు
W/o. Late శ్రీ ఎస్.రంగనాథం గారు
అడ్వొకేట్,
మాజీ కన్వీనర్ : లోక్‌అదాలత్
జననం: 10-6-1934
మరణం: 08-10-2024

కుమారుడు
డా॥ ఎస్.శ్రీనివాస్
రేడియాలజిస్ట్
శ్రీనివాస్ స్కాన్‌సెంటర్, నెల్లూరు.
మరియు కుటుంబసభ్యులు

అంతిమయాత్ర
తేది: 9-10-2024 (ఈరోజు) మ॥ 3 గం॥లకు దర్గామిట్ట కస్తూరిదేవి గర్ల్స్ హైస్కూల్ ఎదురు వీధి, కృష్ణా గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా గల మా స్వగృహము నుండి బయలుదేరును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది. Cell: 92480 44804